ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 18-10- 2026 | సంపుటి: 17, సంచిక: 197, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



బీజేపీవి డైవర్షన్ పాలిటిక్స్

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాకలం):
బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. బీజేపీ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రతిసారీ విదేశీ శక్తులను తెరపైకి తెస్తోందని మండిపడ్డారు. చైనా భూ ఆక్రమణపై మాట్లాడే దమ్ము మోదీకి లేదన్నారు. రోహింగ్యాల పేరుతో దేశ ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. దొరికితే దొంగ అన్నట్లుంది బీజేపీ తీరు అంటూ మండిపడ్డారు. ఈడీ దాడులు కేవలం ప్రతిపక్ష పార్టీ నేతలపైనే ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు.

తరువాయి 2వ పేజీలో...

భారతీయ సినిమాకు హైదరాబాద్‌ను ప్రధాన కూడలిగా

తీర్చిదిద్దుతాం

భట్టి విక్రమార్క

ప్రజా చైతన్యానికి యువ దర్శకులు కదలాలి

బతుకమ్మ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక
వాతావరణ మార్పులు, నీటి సంక్షోభంపై షార్ట్‌ఫిల్మ్‌లతో అవగాహన కల్పించాలి
యువ సినీ ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం
హైదరాబాద్ శిల్ప కళావేదికలో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్-2026లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాకలం):
యువ ఫిలిం మేకర్లు తమ సృజనాత్మకతతో సమాజాన్ని ఆలోచింపజేసే లఘు చిత్రాలను రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభం వంటి సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. బతుకమ్మ పండుగలో రంగురంగుల పూలు ఎలా విరబూస్తాయో, యువ ఫిలిం మేకర్ల జీవితాలు కూడా విజయాలతో అలా వికసించాలనిహో ఆకాంక్షించారు. యువ దర్శకులు మంచి కథలతో ముందుకు వచ్చి, వినోదంతో పాటు సమాజానికి మేలు చేసే చిత్రాలను రూపొందించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను కేవలం తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం చేయకుండా, భారతీయ సినిమాకు ప్రధాన కూడలిగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

తరువాయి 2వ పేజీలో...



మూడు దశల్లో సమగ్ర భూసర్వే

285 గ్రామాల్లో సర్వే పూర్తి

- అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ
- వచ్చేనెల చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు
- మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు
- పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ
- రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాకలం):
రాష్ట్రంలో భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా

తరువాయి 2వ పేజీలో...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి

విజయమే లక్ష్యం

సామ రామ్మోహన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపు



మహబూబ్ నగర్ ప్రజాకలం ప్రతినిధి
అక్టోబర్ 17:
రాబోయే మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర యువజన, క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, రాష్ట్ర ఎక్సైజ్ & ప్రొహిబిషన్ శాఖ మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణలో 315 మండలాల్లో కరువు

పరిస్థితులు.. కేంద్రం తక్షణ సహాయం అందించాలి

'ఖేత్ బచావో అభియాన్'పై కేంద్ర మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి తుమ్మల

సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు ప్రత్యేక అదనపు బడ్జెట్ కేటాయించాలి
మొక్కజొన్న, జొన్న సహా అన్ని ప్రధాన పంటలకు 100 శాతం కనీస మద్దతు ధర కల్పించాలి
ధరల మద్దతు పథకం కింద 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలి
ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించాలి
వ్యవసాయ కూలీలకు ఉపాధి, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి



హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాకలం):
కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో కూడా ఈ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని 22 అక్టోబర్ నుండి 30 నవంబర్ వరకు నిర్వహిస్తామని, దీనికి గాను అఖిల భారత వ్యవసాయ సంస్థలు మరియు విశ్వ విద్యాలయాల సిబ్బంది సహకారంతో వీటిని గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని 315 మండలాల్లో కరువు తరహా పరిస్థితులు నెలకొంటున్నాయని మంత్రి తెలిపారు. పంటల పరిస్థితిని అంచనా వేయడం, అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించడం, పంటలు కోతకు వచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన సాగునీరు, విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూక్ష్మ సేద్యానికి, మధ్యంతర కాలంలో సాగు చేసే పంటలకు అవసరమైన విత్తనాల

తరువాయి 2వ పేజీలో...

13 కోట్ల ఓట్లను తొలగించారు

మోదీ సర్కార్‌పై మధుయాష్కీ ఆరోపణలు



హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాకలం):
ప్రస్తుతం భారతదేశం అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని.. అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడు తూ.. 2014లో మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ రక్షణ కోసం 2017లో రాహుల్ గాంధీ ప్రొఫెషనల్ కాంగ్రెస్‌ను

తరువాయి 2వ పేజీలో...

సింగరేణి భవిష్యత్తుకు మన శ్రమే పునాది

కార్మిక సంక్షేమం, సంస్థ విస్తరణే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
సింగరేణీయులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షల లేఖ



సింగరేణి భవన్, అక్టోబరు 17 : బతుకమ్మ, దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులకు ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సుస్థిర భవిష్యత్తు కోసం కొత్త గనుల సాధన, థర్మల్, సోలార్ రంగంలో బహుముఖ విస్తరణకు ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణకు భారీ వర్ష సూచన

13 జిల్లాలకు అలర్ట్!
హైదరాబాద్ సహా పలు జిల్లాలకు హెచ్చరిక!



హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాకలం):
తెలంగాణలో వాతావరణం మరోసారి మారనుంది. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

తరువాయి 2వ పేజీలో...

తెలంగాణ నీళ్లకు ముప్పు?

గోదావరి-కావేరీ లింక్‌పై హరీశ్ రావు ఆరోపణలు!



హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాకలం):
తెలంగాణ సాగునీటి హక్కులపై మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గ్రామీణం వీవర్‌లో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. Godavari-Cauvery Link పేరుతో కొత్త ప్రతిపాదన తెరపైకి రావడం వెనుక తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో సాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

గోదావరి జలాలపై కొత్త ప్రతిపాదన.. హరీశ్ అభ్యంతరం!

గోదావరి-బనకచర్ల, గోదావరి-నల్లమలసాగర్ ప్రతిపాదనలు ముందుకు సాగలేదని, ఇప్పుడు Godavari-Cauvery Link పేరుతో మరో మార్గంలో జలాలను తరలించే ప్రయత్నం జరుగుతోందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీ నేతలు ఇలాంటి ప్రతిపాదనలపై పెద్దగా మాట్లాడలేదని,

తరువాయి 2వ పేజీలో...

భారతీయ సినిమాకు హైదరాబాద్‌ను ప్రధాన కూడలిగా

తీర్చిదిద్దుతాం

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ యువతలోని సినీ ప్రతిభను ప్రోత్సహిస్తూ, జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను ప్రముఖ సినీ గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ అవార్డ్స్–2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమనిహో అన్నారు. వివిధ రంగులు, సువాసనలతో కూడిన పూలు ఒకచోట చేరినట్లుగా సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చే వేడుక బతుకమ్మ అని పేర్కొన్నారు. అందుకే ఈ పండుగ సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.

హైదరాబాద్‌ను భారతీయ సినిమాకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

తెలుగు చిత్ర పరిశ్రమ హైదరాబాద్‌లోనే ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతులకు తగిన అవకాశాలు లేవనే అభిప్రాయం గతంలో ఉండేదని భట్టి విక్రమార్క అన్నారు. అయితే, ప్రస్తుతం తెలంగాణకు చెందిన పలువురు దర్శకులు, హీరోలు, నిర్మాతలు చిత్ర పరిశ్రమలో తమ ప్రతిభను చాటుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో సృజనాత్మకతకు కొదవలేదని, యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే మరింత మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని చెప్పారు. హైదరాబాద్‌ను భారతీయ సినిమా పరిశ్రమకు ప్రధాన గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా రాష్ట్ర మంత్రివర్గం ఈ దిశగా ఆలోచనలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సినీ రంగ ప్రముఖులను హైదరాబాద్‌కు ఆహ్వానించడం, ఇక్కడ సినిమా రంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుకూల వాతావరణాన్ని కల్పించడం ద్వారా నగరాన్ని భారతీయ సినిమా రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

మూడు నిమిషాల్లో కథ చెప్పడమూ గొప్ప సృజనాత్మకతే

యువ దర్శకుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్ ఛాలెంజ్ నిర్వహించడం అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. మూడు గంటల సినిమాలో చెప్పగలిగే కథను కేవలం రెండు, మూడు నిమిషాల నిడివి ఉన్న షార్ట్‌ఫిల్మ్‌లో చెప్పడం ఎంతో సృజనాత్మకతతో కూడుకున్న విషయమని పేర్కొన్నారు. తక్కువ సమయంలో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, తమ ఆలోచనను సమర్థంగా వ్యక్తీకరించగలిగిన యువ దర్శకులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోటీలో అవార్డులు అందుకోని వారి చిత్రాల్లోనూ మంచి ప్రతిభ కనిపించిందని పేర్కొంటూ, అవార్డు రాకపోయినంత మాత్రాన నిరుత్సాహపడవద్దని యువ ఫిలిం మేకర్లకు సూచించారు. భవిష్యత్తులో ఎవరు గొప్ప దర్శకులుగా ఎదుగుతారో ఇప్పుడే చెప్పలేమని, అందరూ తమ సృజనాత్మకతను కొనసాగిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యువ దర్శకులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ట్‌ఫిల్మ్‌లు, పాటలు, జానపద గీతాలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, వ్యాసాలు తదితర విభాగాల్లో మొత్తం 29 అవార్డులతో యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. యువత రూపొందించిన షార్ట్‌ఫిల్మ్‌లను వీక్షించి, ప్రతిభావంతులను మరింతగా ప్రోత్సహించే అవకాశాలను పరిశీలిస్తానని తెలిపారు.

వాతావరణ మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

సినిమా వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించే సాధనంగా మారాలని భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యంగా రాబోయే రోజుల్లో వాతావరణ మార్పులు, సూపర్ ఎల్‌నినో ప్రభావాలు, ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతంలో మార్పులు ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంలో యువ దర్శకులు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే కథలతో, ఆకట్టుకునే దృశ్యాలతో షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించి ప్రకృతి పరిరక్షణ, నీటి పొదుపు, పర్యావరణ సమతుల్యతపై చైతన్యం కల్పించవచ్చన్నారు. ఒక చిన్న గ్రామంలో జరిగే సంఘటన ఆధారంగా రూపొందించిన లఘు చిత్రం కూడా నేటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలదని చెప్పారు. యువ దర్శకుల చేతుల్లో సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

భవిష్యత్తులో నీటి లభ్యత కీలక సమస్యగా మారే ప్రమాదం ఉందని ఉప ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆహార ధాన్యాల లభ్యతతో పోలిస్తే తాగునీటి నిల్వలు, వాటి సంరక్షణపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వర్షపాతం పరిస్థితులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి ఆవిరి పెరుగుదల వంటి అంశాలు భవిష్యత్తులో నీటి వనరులపై ఒత్తిడిని పెంచవచ్చని పేర్కొన్నారు. మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా ఎలా కాపాడుకోవాలి, వర్షపు నీటిని ఎలా ఒడిసిపట్టాలి, ప్రకృతిని ఎలా పరిరక్షించాలి వంటి అంశాలను కథాంశాలుగా తీసుకొని షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించాలని యువ దర్శకులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందించడంలో కళాకారులు, కథానాయకులు, ఫిలిం మేకర్లు కీలక పాత్ర పోషించగలరని చెప్పారు.

విద్యుత్ పొదుపుపైనా చైతన్యం అవసరం

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వాతావరణ మార్పుల ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించే కథాంశాలను కూడా యువ దర్శకులు ఎంచుకోవాలని సూచించారు. ప్రజల దైనందిన జీవితానికి ఉపయోగపడే సందేశాలను సృజనాత్మకంగా అందిస్తే షార్ట్‌ఫిల్మ్‌లు సామాజిక మార్పునకు దోహదపడతాయని పేర్కొన్నారు.

కళలు, సృజనాత్మకతకు ప్రభుత్వ ప్రోత్సాహం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కళలు, సృజనాత్మకత పట్ల ఆసక్తి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి స్వయంగా ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చదువుకున్న నేపథ్యంలో కళారంగంలోని ప్రతిభను ప్రోత్సహించే ప్రయత్నాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. యువతలోని ప్రతిభను గుర్తించి, వారికి అవకాశాలు కల్పించడం ద్వారా తెలంగాణ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే దర్శకులు, కళాకారులు ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు.

మూడు దశల్లో సమగ్ర భూసర్వే

మొదటి పేజీ తరువాయి...

మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని పేర్కొన్నారు. భూ సర్వేలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ సమస్యలు లేని తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ అధికారులతో భూ సర్వే పురోగతిపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గానూ తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 285 గ్రామాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు.

భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీసర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉపవిభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర రీసర్వే చేపడుతున్నట్లు వివరించారు.

గతంలో భూముల కొలతలకు ఉపయోగించిన గొలుసులు, కర్రలు, క్రాస్‌స్టాఫ్, మెజరింగ్ టేపుల వంటి సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా భూముల కొలతల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూరుస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామని, అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. రోవర్ల వినియోగంతో భూముల సర్వేను వేగంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలవుతుందని చెప్పారు. రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సర్వే సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు. రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని తెలిపారు.

త్వరలో పాలేరులో భూదార్ పట్టాల పంపిణీ రీసర్వే ద్వారా ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక సర్వే పటాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు వీలవుతుందన్నారు.

తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాలలో వందశాతం రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. భూ రీసర్వేలో అధికారులు తప్పనిసరిగా అనుసరించాల్సిన విధానాలపై మంత్రి గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని సూచించారు. సర్వే నిర్వహించే విషయం భూ యజమానులకు ముందుగానే తెలియజేయడం ద్వారా వారు అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు చేయాలని సూచించారు.అదేవిధంగా, గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధుల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో స్పష్టత తీసుకురావాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని మంత్రి తెలిపారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రీసర్వేను అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా భావించకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేసి రీసర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

సర్వే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూ యజమానులు సంతృప్తి చెందేలా ప్రతి చర్య చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా కోణంలోనే ఆలోచించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు.

తెలంగాణకు భారీ వర్ష సూచన

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యంగా అక్టోబర్ 18, 19 తేదీల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడొచ్చని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు Yellow Alert జారీ చేసింది. వర్షాలతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉత్తర తమిళనాడు, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సుమారు 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపారు. Telangana Weather Forecast, Hyderabad Rain Alert, Thunderstorms Warning వివరాలను ప్రజలు గమనించాలని సూచించారు.

ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అక్టోబర్ 18న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్ష సూచన నేపథ్యంలో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో వర్షం, ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. వర్షం పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడకుండా ఉండాలని సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండకపోవడం మంచిది. వాహనదారులు రహదారులపై జాగ్రత్తగా ప్రయాణించాలి. వాతావరణ పరిస్థితులు వేగంగా మారే అవకాశం ఉన్నందున Telangana Rain Update కోసం అధికారిక వాతావరణ శాఖ తాజా సూచనలను గమనించాలని అధికారులు తెలిపారు.

తెలంగాణ నీళ్లకు ముప్పు?

మొదటి పేజీ తరువాయి...

తాము అభ్యంతరాలు వ్యక్తం చేసిన తర్వాతే ప్రస్తుత ప్రభుత్వం స్పందిస్తోందని విమర్శించారు. నీటి లభ్యత, నికర జలాల అంశాలపై Central Water Commission స్పందన కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం మరింత స్పష్టమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విధానాల వల్ల తెలంగాణకు నష్టం జరుగుతోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోయే పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. El Nio ప్రభావం పేరుతో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని విమర్శిస్తూ, సాగునీటి నిర్వహణలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. అయితే ఇవి ప్రతిపక్ష నేత చేసిన రాజకీయ ఆరోపణలు కాగా, వాటిపై ప్రభుత్వ స్పందనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

దేవాదుల మోటార్లపై ప్రశ్నలు.. వరంగల్‌కు కరువు ఎందుకు?

దేవాదుల ప్రాజెక్టులో మొత్తం 10 మోటార్లు అందుబాటులో ఉన్నప్పటికీ, మూడు మోటార్లనే నడిపించారని హరీశ్ రావు ఆరోపించారు. అన్ని మోటార్లను సమర్థంగా నడిపి ఉంటే వరంగల్ జిల్లాలో సాగునీటి కొరత ఈ స్థాయికి వచ్చేది కాదని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో Crop Holiday పరిస్థితులు లేవని, కరువు సమస్య కూడా తెలంగాణతో పోలిస్తే తక్కువగా ఉందని పేర్కొంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణలో వర్షపాతం ఎక్కువగా నమోదైనప్పటికీ రైతులు నీటి ఇబ్బందులు ఎదుర్కోవడానికి కారణమేంటని నిలదీశారు.

తెలంగాణ సాగునీటిపై రాజకీయ పోరు ముదురుతుందా?

గోదావరి జలాల వినియోగం, అంతర్రాష్ట్ర నీటి పంపకాలు, ప్రాజెక్టుల నిర్వహణ అంశాలు మరోసారి తెలంగాణ రాజకీయాల్లో కీలక చర్చగా మారాయి. ఒకవైపు హరీశ్ రావు ప్రభుత్వం తీరుపై ప్రశ్నలు సంధిస్తుండగా, మరోవైపు ఈ ఆరోపణలపై అధికార పక్షం వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. Godavari Water Sharing, Irrigation Projects, Devadula Project, Telangana Drought వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు రైతుల భవిష్యత్తును ప్రభావితం చేయనున్నాయి. తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి

విజయమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

మహబూబ్‌నగర్ పట్టణంలోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు పాల్గొని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ వాకిటి శ్రీహరి , శ్రీ జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని సంప్రదించి ఓటరు జాబితాలో పేరు నమోదయ్యేలా చూడటంతో పాటు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నారు. బూత్ స్థాయి నాయకులు, ఏజెంట్లు సమర్థవంతంగా పనిచేస్తే పార్టీ విజయానికి బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతర్గత విభేదాలకు తావివ్వకుండా ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు స్థాయిలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ పార్టీ బలాన్ని, ప్రజాదరణను చాటాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలు, ఓటర్లతో సమన్వయం, పోలింగ్ రోజున చేపట్టాల్సిన చర్యలపై బూత్ స్థాయి నాయకులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, అనిరుధ్ రెడ్డి, ఈ. శంకర్, మేఘా రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ చైర్‌పర్సన్ సరిత, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి , టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్ కుమార్, మిథున్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిరాజ్ ఖాద్రీ, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు , వీరితో పాటు మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, మహబూబ్‌నగర్ జిల్లా బూత్ లెవెల్ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సమష్టిగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

సింగరేణి భవిష్యత్తుకు మన శ్రమే పునాది

మొదటి పేజీ తరువాయి...

మారుతున్న బొగ్గు మార్కెట్‌లో పోటీని ఎదుర్కొంటూ సంస్థను మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూగర్భ, ఉపరితల గనుల్లో కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ కార్మికులు వెలికితీసే బొగ్గు తెలంగాణ విద్యుత్ అవసరాలకు, రాష్ట్ర అభివృద్ధికి చోదక శక్తి అని అన్నారు.ఎల్ నినో ప్రభావం వంటి వాతావరణ సవాళ్ల వేళ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా నిరంతరంగా జరిగేలా మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మారుతున్న బొగ్గు మార్కెట్‌లో ఇతర సంస్థలతో పోటీపడాలంటే నాణ్యమైన బొగ్గును సరసమైన ధరకు అందించడం, ఉత్పాదకత పెంచడం, అనవసర ఖర్చులను తగ్గించడం అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికులు, ఉద్యోగు లు, అధికారులు, యాజమాన్యం సమన్వయం తో పనిచేయాలని, యంత్రాలను పూర్తి పని గంటలు సమర్థంగా వినియోగించాలని సూ చించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో భద్రతకు ఎట్టి పరిస్థితుల్లోనూరాజీపడకూడదని, ప్రతికార్మికుడు క్షేమంగా ఇంటికిచేరడమే తొలి విజయమని స్పష్టం చేశారు. 137 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణిని భావితరాలకు మరింత బలంగా అందించేందుకు కొత్త గనుల సాధనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గనికి అవసరమైన అనుమతులు సాధించి ఉత్పత్తి ప్రారంభించామని, తాడిచెర్ల–2 బ్లాక్‌కు మైనింగ్ లీజు పొందామని చెప్పారు. మణుగూరు ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్–2 డీప్ సైడ్ బ్లాక్‌ను వేలం ద్వారా దక్కించుకున్నామని, సత్తుపల్లి–3, కోయగూడెం–3 బ్లాక్‌లను తిరిగి సాధించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వివరించారు.

బీజేపీవి డైవర్షన్

పాలిటిక్స్

మొదటి పేజీ తరువాయి...

ఎన్నిక ప్రక్రియ నిబంధనలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎందుకు మార్చారని, కమిటీలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఎందుకు తొలగించారని పీసీసీ చీఫ్ నిలదీశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ ఎన్నికైన రోజే ప్రమాదాన్ని గురించి రాహుల్ గాంధీ హెచ్చరించారని గుర్తుచేశారు. 'మీరు ప్రజల మద్దతుతో గెలవలేరు.. అందుకే ఓటు దొంగతనానికి పాల్పడ్డారు' అంటూ బీజేపీపై విరుచుకుపడ్డారు. పెద్ద రాష్ట్రాలలో ఓట్ల దొంగతనం ఎక్కువగా జరుగుతోందని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సీపీఎం మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నామని మహేశ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో సీపీఎం కలిసి పనిచేస్తోందని చెప్పారు. నేటి సీపీఎం పోలిట్‌బ్యూరో మీటింగ్ తర్వాత వారి నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల మద్దతు కూడగడతామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

13 కోట్ల ఓట్లను

తొలగించారు

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు చేశారని తెలిపారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటే ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పాత్ర కీలకమని చెప్పుకొచ్చారు. ఇతర పార్టీలో ఉన్న వారు కూడా ప్రొఫెషనల్ కాంగ్రెస్‌లో భాగం పంచుకోవచ్చని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సభ్యత్వంలేని వారు కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేయొచ్చని అన్నారు. దేశంలో 'సర్' ద్వారా 13 కోట్ల ఓట్లను మోదీ ప్రభుత్వం తొలగించిందని మధుయాష్కీ ఆరోపించారు. 13 కోట్ల ఓట్లలో ఎక్కువ మంది దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓట్లు ఉన్నాయన్నారు. తొలగించిన 13 కోట్ల ఓట్లు ఆధారాలతో బయటపెట్టామని అన్నారు. ూ×=పై పోరాటం కాంగ్రెస్ భవిష్యత్తు కోసం కాదని.. దేశ ప్రజల భవిషత్తు కోసమని స్పష్టం చేశారు. బీజేపీ మోదీ ప్రభుత్వం పౌరుల స్వేచ్ఛను కాలరాస్తోందని విమర్శించారు. క్లిష్ట సమయంలో తనకు అప్పజెప్పిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. హొమనోహ్మన్ సింగ్ ఫెలోషిప్ ద్వారా వివిధ రంగాల్లో వచ్చిన నిష్ణాతులైన 50 మందికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చారని మాధుయాష్కీ తెలిపారు. రెండో దఫా 800 అప్లికేషన్స్ వచ్చాయని.. 100 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. బారిస్టర్లు, లాయర్లు, డాక్టర్లతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పడిందన్నారు. భారత పౌరులకు రక్షణ కల్పించేది రాజ్యాంగమన్నారు. ప్రొఫెషనల్స్‌కు క్రెడిబులిటీ ఉండాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకరావడంలో ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితుల కోసం ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ప్రజలకు, ప్రతి పౌరుడికి గౌరవ ప్రదమైన జీవితం అందించడానికి ప్రొఫెషనల్ కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నిష్ణాతులతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేశామని మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

తెలంగాణలో 315 మండలాల్లో కరువు

మొదటి పేజీ తరువాయి...

కోసం ప్రత్యేకంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని మంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు ఎదురయ్యే నష్టాలను తగ్గించేందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎరువుల ధరలు, సబ్సిడీల అంశాన్ని ప్రస్తావిస్తూ యూరియాపై అధిక సబ్సిడీ కారణంగా ఇతర ఎరువులతో పోలిస్తే దాని ధర తక్కువగా ఉందని, దీనివల్ల యూరియా అధిక వినియోగం పెరిగి నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని మంత్రి తెలిపారు. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించి, ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు.రైతులు పంటల మార్పిడికి ముందుకు రావాలంటే పండించిన పంటలకు కనీస మద్దతు ధరపై కొనుగోలు భరోసా కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు సహా అన్ని ప్రధాన పంటలను కనీస మద్దతు ధర పై 100 శాతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ధరల మద్దతు పథకం (గూూ) కింద ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందనిమంత్రి తెలిపారు. VB--G RAM G పథకం కింద నిధుల కేటాయింపును పెంచడంతో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం, నీటి సంరక్షణ, భూమి అభివృద్ధి పనులను ప్రోత్సహించాలని సూచించారు.

వెట్టిచారికి నిర్మూలనపై చైతన్య రథంను
ప్రారంభించిన అదనపు కలెక్టర్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజా కలం)

వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులకు ఫిర్యాదు మార్గాలను తెలియజేసేందుకు జగిత్యాల జిల్లాలో చేపట్టిన చైతన్య రథం ప్రచార కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అవగాహన ప్రచారంలో భాగంగా సహాయ కార్మిక కమిషనర్, జగిత్యాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కుల పరిరక్షణ, కార్మికులపై దోపిడీ జరిగినప్పుడు ఫిర్యాదు చేసే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ ప్రచార ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే చైతన్య రథం ద్వారా వెట్టిచాకిరీకి సంబంధించిన చట్టపరమైన అంశాలు, కార్మికుల హక్కులు, బాధితులకు అందుబాటులో ఉన్న సహాయ సేవలపై ప్రచారం నిర్వహించనున్నారు. అలాగే బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ 080-69434343 నంబర్‌ను ప్రజలకు చేరువ చేయనున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమిషనర్ ఎం. సురేంద్రకుమార్, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనంపై నలుగురు
రోడ్లపై ప్రమాదకర సవారీ! - నియంత్రించాలంటున్న ప్రజలు!!



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజా కలం) సామాన్యులకు సౌకర్యవంతమైన ప్రయాణం కోసం రూపొందించిన ద్విచక్ర వాహనాలపై కొందరు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఇద్దరు ప్రయాణించాల్సిన బైక్‌పై ముగ్గురు, నలుగురు.. సందర్భాన్ని బట్టి ఐదుగురు సైతం ఎక్కుతూ రహదారులపై మినీ బస్సుల తరహాలో సవారీ చేస్తున్నారు. ఇలాంటి దృశ్యాలు మెట్‌పల్లి పట్టణంలో కనిపిస్తుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. కొందరు దినసరి కూలీలు దూర ప్రాంతాల్లో పనులకు వెళ్లేందుకు ఒకే ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణించడం సాధారణంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. అయితే, ఇలా పరిమితికి మించి ప్రయాణించడం వల్ల వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే ప్రయాణిస్తున్న వారితో పాటు ఇతర వాహనదారులు, పాదచారుల ప్రాణాలకూ ముప్పు ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.ఇటీవల మెట్‌పల్లి పట్టణంలో ఒక ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణిస్తున్న దృశ్యం స్థానికులను అవాక్కయ్యేలా చేసింది. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలపై పోలీసులు దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ద్విచక్ర వాహనాలపై పరిమిత సంఖ్యలోనే ప్రయాణించేలా అవగాహన కల్పించడంతో పాటు కఠినంగా నియంత్రించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ "కోతలను" ఎత్తివేయాలి
- వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ గుండాటి గోపిక- జితేందర్ రెడ్డి

వెల్గటూర్, సెప్టెంబర్ 17, ప్రజాకలం, ప్రతినిధి :తెలంగాణ ప్రజలు, రైతులు అప్రకటిత విద్యుత్ కోతల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అప్రకటిత విద్యుత్ కోతలను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా మహిళా నాయకురాలు, వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండాటి గోపిక- జితేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. కరెంటు పదే పదే ట్రిప్ కావడంతో హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ సమస్య తలెత్తి రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని, దీని వల్ల రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందే సమయంలో నీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు..ఎల్ ని నో ప్రభావంతో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, దానికి తోడు విద్యుత్ కోతలు విధించడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేసి, రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందించి పంటలు ఎండిపోకుండా కాపాడాలని కోరారు.



దుర్గామాత మాల విరమణకు బయలుదేరిన బెల్లంపల్లి భవాని స్వాములు

బెల్లంపల్లి, అక్టోబర్ 17, (ప్రజాకలం) ప్రతినిధి మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయితిలోని బంగారు మైసమ్మ ఆలయంలో భవాని స్వాములు ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు.

దుర్గమాత మాలవిరమణకు బయలుదేరిన భవానీ స్వాములు,కొబ్బరికాయ కొట్టి సాగనంపిన కాంగ్రెస్ నాయకులు ప్రజ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి.అమ్మవారి ఆశీస్సులు భవాని భక్తులకు ఎల్లవేళలా ఉండాలని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని అయిన కోరుకున్నారు.



కరెంటు కోతలతో ఎండుతున్న పంటలు
పభుత్వం వెంటనే స్పందించాలి
రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి
బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజాకలం):-మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదేశాల మేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సస్యశ్యామలంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం చీకట్లోకి నెడుతోందని విమర్శించారు. విద్యుత్ సరఫరా, సాగునీటి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు సరఫరా సక్రమంగా జరిగితే విద్యుత్ ఉత్పత్తి మెరుగ్గా ఉండేదని, రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం వల్ల విద్యుత్ వ్యవస్థ సంక్షోభంలో పడుతోందని ఆరోపించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరిగితే తెలంగాణ రైతాంగానికి మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.రైతులకు పంట నష్టం జరగకుండా తక్షణమే విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, తిరుపతిరెడ్డి, ఏనుగందుల శ్రీనివాస్‌గౌడ్, పూజారి సుధాకర్‌గౌడ్, విష్ణు, జావిద్, భీమనాథ్ సత్యనారాయణ, ఆకుల ప్రవీణ్, మొరపు తేజ, సుద్దాల రాజేశ్వర్‌గౌడ్, మహేందర్, చిరంజీవి తదితర నాయకులు పాల్గొన్నారు.

మెట్ పల్లి టౌన్ కాంగ్రెస్ కార్యదర్శిగా రాజశేఖర్



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజా కలం):- పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బెధుగం రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఆయనను శాలువాతో సత్కరించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రాజశేఖర్ పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు,11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేశ్ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా భూరం...

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా భూరం రాజేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఆయనను శాలువాతో సత్కరించి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ తదితరులు భూరం రాజేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కాంగ్రెస్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని భూరం రాజేష్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజంగి నందయ్య, జువ్వాడి నర్సింగరావు,11వ వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేశ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భూరం రాజేష్ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

మెట్ పల్లిలో ఘనంగా బోనాల పండుగ
భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు - నృత్యాలతో యువతి, యువకుల సందడి



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజాకలం): -శ్రీ దుర్గా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మెట్ పల్లి మున్నూరు కాపు పటేల్ సంఘం, యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని దుర్గాదేవి మండపం నుంచి బుక్కవాడ పోచమ్మ, బెస్తవాడ పోచమ్మ ఆలయాల వరకు మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకొని మంగళహారతులతో భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. యువతీ యువకుల నృత్యాలతో బోనాల జాతర ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి, బోనాల జాతరకు పలువురు ప్రముఖులు హాజరై పాల్గొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు నవీన్ రావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పుప్పాల లింబాద్రి, కౌన్సిలర్లు బొడ్ల రమేశ్, నాగేశ్, ఆనంద్, ఆకుల ప్రవీణ్, గౌతమ్, రాహుల్, రూపేశ్, రానాతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఢిల్లీలో బతుకమ్మ వేడుకల్లో ఆత్మకూరు ఒగ్గు కళాకారుల ప్రదర్శన



గొల్లపల్లి అక్టోబర్ 17 ప్రజా కలం ప్రతినిధి తెలంగాణ సంస్కృతిని దేశ రాజధానిలో 12 మంది ఒగ్గుడోలు కళాకారులు చాటి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో గొల్లపల్లి మండలం ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో తెలంగాణ నుంచి ఒగ్గు రవి కళాకారులు బృందం పాల్గొని సంప్రదాయ ఒగ్గు డోలు ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కు సంబంధించిన కార్యక్రమ ప్రాంగణంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ జానపద కళల గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఒగ్గు డోలు వాయిద్యాల నాదంతో, సంప్రదాయ కళారూపాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద కళలు, కళాకారుల ప్రతిభను దేశ రాజధానిలో ప్రదర్శించే అవకాశం రావడం తమకు గర్వకారణమని కళాకారులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సంప్రదాయ కళలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు తెలంగాణ సంస్కృతికి మరింత గుర్తింపు తీసుకొస్తాయని తెలిపారు. ఆత్మకూర్ ప్రాంతానికి చెందిన 12 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొనడం పట్ల స్థానికులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కళాకారులు దీకొండ రాజశేఖర్, శివకుమార్, మహేష్, రాము, రాజు, అరవింద్, రమేష్, అక్షయ్ కుమార్, సిద్ధార్థ, విష్ణువర్ధన్, అజిత్ కుమార్, అరవింద్ పాల్గొని విజయవంతవం చేశారు.

క్రికెట్ టీం సభ్యులకు టీ షర్ట్ వితరణ
- రాపోలు శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో



ఎండపల్లి, అక్టోబర్ 17 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని గుల్లకోట గ్రామానికి చెందిన రాపోలు శ్రీనివాస్ రావు ను క్రికెట్ టీం సభ్యులు టి షర్ట్స్ కావాలని ఆర్ఎస్ రావు ను అడగగా దానికి స్పందించిన రాపోలు శ్రీనివాస్ రావు 14 మంది క్రికెట్ టీం సభ్యులకు శనివారం రోజున టీ షర్ట్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో గుండ గంగయ్య, క్రికెట్ టీం సభ్యులు కెప్టెన్ గోనే సురేష్, వైస్ కెప్టెన్, కమలాకర్, 5 స్టార్ వెంకీ, రాజేందర్, రాజు, కె విజయ్, సాయిచరణ్, బన్నీ, వెంకటేష్, సాయి, హరీష్, ప్రణీత్, శ్రీధర్ యాదవ్, సాయి కిరణ్ క్రికెట్ టీం సభ్యులు అందరూ కలసి రాపోలు శ్రీనివాస్ రావు, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

బెల్లంపల్లి ఎం సి పి ఐ యు ఆధ్వర్యంలో
మాజీ ఎమ్మెల్యే ముద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి



బెల్లంపల్లి, అక్టోబర్ 17, (ప్రజాకలం) ప్రతినిధి ఎంసిపిఐయు పార్టీ మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ముద్దికాయల ఓంకార్ 18వ వర్ధంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో స్మారక స్థూపం వద్ద ఏంసిపిఐయు నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏంసిపిఐ(యు)పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాద దోపిడి విధానాలను ప్రత్యామ్నాయం మార్గిజం అంబేద్కర్ ఆలోచన విధానమే ఏకైక మార్గమని అందుకోసం నికరంగా నిలబడి ముందుకు సాగుతున్న పార్టీ ఏంసిపిఐ(యు) మాత్రమే అని వారు అన్నారు. 80 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఆకలి ,దారిద్రం, నిరుద్యోగం, ఆత్మహత్యలు, అత్యాచారాలు, హింసతోపాటు, కుల మత బేధాలు, ప్రాంతీయ తత్వాలను , పాలకవర్గాలు అనైతిక రాజకీయ విధానాలతో పెంచి పోషిస్తున్నాయన్నారు. ఎంసిపిఐ యు పార్టీ ప్రజా సమస్యల పరిష్కారం కై ఎప్పటికప్పుడు పోరాడుతూ, ప్రజలకు అందాల్సిన సంక్షేమం చేపట్టాల్సిన అభివృద్ధిపై నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుంది అన్నారు. మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ముద్దికాయల ఓంకార్ చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,మండల కార్యదర్శి సతీష్,మహిళ సమాఖ్య నాయకులు కాంపల్లి రాధ,దుర్గం లక్ష్మి, కామెర పద్మ,యువజన,విద్యార్థి నాయకులునరేష్,శేఖర్, సాయి,రాం,మహేష్,ఆకాష్,అరుణ్ వివిధ మండలాల నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు

మృతుల కుటుంబాలకు మంత్రి అడ్లూరి
రూ. 20 వేలు ఆర్థిక సహాయం..



వెల్గటూర్, అక్టోబర్ 17, ప్రజాకలం, ప్రతినిధి :జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని కప్పర్రావుపేట వద్ద రాష్ట్ర రహదారి పై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన శాతరాజుల కొమురయ్య, ముల్కల్ల శ్రీనివాస్ లు మృతి చెందారు. కాగా ఈ సంఘటన పై స్పందించిన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటానని అన్నారు. కాగా ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కు కిషన్ రావుపేట గ్రామస్తులు కృతజ్ఞతలను తెలియజేశారు.

రక్త దానం చేసి గర్భిణి ప్రాణాలు కాపాడిన దీక్షా స్వాములు
మెట్ పల్లి త్రిశక్తి దేవాలయ దీక్షా స్వాముల మానవతా సేవ

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి, అక్టోబర్ 17 (ప్రజాకలం):-



మానవసేవే మాధవసేవ అనే నానుడిని నిజం చేస్తూ, అత్యవసర సమయంలో రక్తదానం చేసి గర్భిణి ప్రాణాలు కాపాడారు మెట్టుపల్లి శ్రీ త్రిశక్తి దేవాలయ దీక్షా స్వాములు. రేగుంట ప్రాంతానికి చెందిన తెడ్డు లాస్య అనే గర్భిణికి అత్యవసర శస్త్రచికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. బ్లడ్ బ్యాంకులో రక్తం అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న త్రిశక్తి దేవాలయ దీక్షా స్వాములు ఉషకోల ధనుష్, ఆడెపు రాజేష్ వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకున్నారు. అవసరమైన ఓ పాజిటివ్ రక్తాన్ని దానం చేసి గర్భిణికి అండగా నిలిచారు. అత్యవసర సమయంలో మానవతా దృక్పథంతో స్పందించిన స్వాములకు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన దీక్షా స్వాములను త్రిశక్తి దేవాలయ కమిటీ నాయకులు ద్యావనపెల్లి రాజారాం, అన్నం నాగరాజు, గుజ్జేటి శ్రీనివాస్, బేతు భాస్కర్ తదితరులు అభినందించారు. భక్తితో పాటు సమాజ సేవలోనూ ముందుండటం అభినందనీయమని, స్వాములు చేసిన రక్తదానం పలువురికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

నల్ల సంగీత ని సత్కరించిన రూప్ కుమారి చౌదరి

బెల్లంపల్లి, అక్టోబర్ 17, (ప్రజాకలం) ప్రతినిధి.. తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు.నిర్మల్ జిల్లా మహిళా మోర్చా ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన నల్లుల సంగీత పార్టీ బలోపతానికి చేసిన కృషి,ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టినందుకుగాను నల్లుల సంగీతను జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు రూప్ కుమారి చౌదరి శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నల్లుల సంగీత మాట్లాడుతూ పార్టీ కోసం చేస్తున్న సేవలను బిజెపి జాతీయ మోర్చా అధ్యక్షురాలు గుర్తించి తనను సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.....



ప్రజా కలం
ఆదివారం, అక్టోబర్ 18, 2026

ఉపాధికి దూరమవుతున్న ఉన్నత విద్య

చేతిలో పట్టా ఉంది. ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యం లేదు. చదువుకు ఏళ్లు వెచ్చించారు. కుటుంబాలు అప్పులు చేశాయి. అయినా ఉపాధి కోసం మరో శిక్షణ సంస్థ గుమ్మం తొక్కాల్సిందే! ఈ పరిస్థితి విద్యార్థుల వైఫల్యమా? వారిని ఉద్యోగ ప్రపంచానికి సిద్ధం చేయని విద్యావ్యవస్థ వైఫల్యమా? విశ్వవిద్యాలయంలో పూర్తయిన చదువుకు, ఉద్యోగంలో ప్రారంభమయ్యే పనికి సంబంధం బలహీనపడితే ఉన్నత విద్యపై విశ్వాసమే దెబ్బతింటుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ–మానవాభివృద్ధి సంస్థ సంయుక్తంగా విడుదల చేసిన 'భారత ఉపాధి నివేదిక–2024' ప్రకారం, 2022లో పట్టభద్రులు, అంతకంటే ఉన్నత విద్యార్హతలున్న యువతలో నిరుద్యోగిత 29.1 శాతం. ఉన్నత విద్యార్హత ఒక్కటే ఉపాధికి హామీ ఇవ్వలేదని ఈ గణాంకం హెచ్చరిస్తోంది. అయితే ఉద్యోగాల కొరతను విస్మరించి, నిరుద్యోగానికి విద్యార్థుల నైపుణ్యాలనే కారణంగా చూపడం అన్యాయం. నాణ్యమైన విద్యతోపాటు తగిన ఉద్యోగాల సృష్టికీ ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. సంస్కరణ మొదట తరగతి గదిలో ప్రారంభం కావాలి. పాఠాన్ని గుర్తుపెట్టుకుని పరీక్షలో రాసే విద్యార్థికి మార్కులు రావచ్చు. కానీ ఎదురైన సమస్యను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యం అలవడకపోవచ్చు. అందుకే బోధనలో చర్చలు, ప్రయోగాలు, సమస్యల అధ్యయనం తప్పనిసరి కావాలి. విద్యార్థి ప్రశ్నించాలి; తన అభిప్రాయానికి ఆధారాలు చూపాలి; పొరపాటును గుర్తించి సరిదిద్దుకోవాలి. ఇదే విమర్శనాత్మక ఆలోచనకు పునాది. పాఠ్యప్రణాళికలు కాలానికి అనుగుణంగా మారాలి. ప్రతి కోర్సులో సంబంధిత వృత్తి పరిజ్ఞానంతోపాటు స్పష్టంగా మాట్లాడటం, సమర్థంగా రాయడం, డిజిటల్ సాధనాలను ఉపయోగించడం, బృందంగా పనిచేయడం నేర్పాలి. పరిశ్రమల నిపుణులు, అధ్యాపకులు కలిసి అభ్యసన లక్ష్యాలను నిర్ణయించాలి. వాటిని విద్యార్థులు ఎంతవరకు సాధించారో ప్రాజెక్టులు, ప్రాయోగిక పరీక్షల ద్వారా అంచనా వేయాలి. కంఠస్థ జవాబులకు ఇచ్చే ప్రాధాన్యం తగ్గాలి. ఇంటర్న్‌షిప్‌ల పేరుతో ధ్రువపత్రాలు అందించడం వల్ల ప్రయోజనం లేదు. విద్యార్థికి నిజమైన పని అప్పగించాలి. నేర్పించే మార్గదర్శకుడు ఉండాలి. చేసిన పనిపై సమీక్ష జరగాలి. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు అవకాశాలను కోల్పోకుండా ప్రయాణం, వసతి సహాయం అందించాలి. ఉపాధి మార్గదర్శకత్వం చివరి సంవత్సరంలో మొదలయ్యే హడావుడిగా మిగలకూడదు. పరిశోధన కూడా పట్టాల కోసం సమర్పించే నివేదికలకే పరిమితం కాకూడదు. స్థానికంగా ఎదురవుతున్న నీటి కొరత, వ్యవసాయ సమస్యలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థులను పనిచేయించాలి. సమస్యను గుర్తించడం నుంచి పరిష్కారాన్ని పరీక్షించడం వరకు వారికే బాధ్యత ఇవ్వాలి. కొత్త ఆలోచనకు ప్రోత్సాహం, ప్రయోగానికి వనరులు, విఫలమైనప్పుడు మళ్లీ ప్రయత్నించే అవకాశం ఉంటేనే సృజనాత్మకత పెరుగుతుంది. అయితే అధ్యాపకులు లేకుండా నైపుణ్యాలు నేర్పలేం. ప్రయోగశాలలు లేకుండా పరిశోధన కోరలేం. ప్రభుత్వాలు ఖాళీలను భర్తీ చేసి, అవసరమైన నిధులు అందించాలి. విశ్వవిద్యాలయాలు బోధన నాణ్యతపై బాధ్యత వహించాలి. ఎన్ని పట్టాలు ఇచ్చామన్న లెక్కతోపాటు, విద్యార్థులు ఏమి నేర్చుకున్నారు, ఎలాంటి ఉపాధి పొందారన్న వివరాలను బహిర్గతం చేయాలి. నియామకాలకు వచ్చిన సంస్థల సంఖ్యనే విజయంగా ప్రకటించే పద్ధతి మారాలి. ఉద్యోగాల స్వభావం, వేతనం, చదివిన కోర్సుతో వాటికున్న సంబంధం కూడా వెల్లడించాలి. ఉపాధి పొందలేని విద్యార్థులకు అవసరమైన అదనపు శిక్షణ అందించాలి. పూర్వ విద్యార్థుల అనుభవాలను సేకరించి బోధనలో లోపాలను సవరించాలి. పరిశ్రమలు కూడా సిద్ధంగా ఉన్న అభ్యర్థులనే కోరుతూ బాధ్యత ముగించకుండా, శిక్షణ అవకాశాలు కల్పించాలి. ఈ భాగస్వామ్యానికి స్పష్టమైన లక్ష్యాలు, గడువులు ఉండాలి. పురోగతిని ఏటా సమీక్షించాలి. ఫలితాలు రాకపోతే కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఉన్నత విద్య ఉద్యోగానికి సిద్ధం చేయాలి; స్వతంత్రంగా ఆలోచించే శక్తినీ ఇవ్వాలి. ఈ రెండింటినీ సాధించడమే విశ్వవిద్యాలయాల కర్తవ్యం. యువతకు మరో పట్టా కాదు, నేర్చుకున్నదానితో నిలబడగల సామర్థ్యం కావాలి. స్నాతకోత్సవ వేదికపై అందించే ధ్రువపత్రానికి జీవితంలో విలువ చేకూర్చినప్పుడే ఉన్నత విద్య తన బాధ్యత నెరవేర్చినట్లు!

– సి.హెచ్. ప్రతాప్





దసరా, దుర్గా నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత

పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల్ ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజా కలం)

జగిత్యాల జిల్లా దుర్గా నవరాత్రి ఉత్సవాలు, దసరా పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ పోలీస్ అధికారులకు సూచించారు. శనివారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ వనితీరును నమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా తదితర అంశాలను పరిశీలించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి మండపాల వద్ద భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్ఐ కుమారస్వామి ఉన్నారు.

రైతుల గోస పట్టని కాంగ్రెస్ సర్కారు

రాఘవాపూర్ విద్యుత్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా
బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సురేష్ రెడ్డి
కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్కూరి సత్యనారాయణ రెడ్డి
కలెక్టరేట్ లో అధికారులకు వినతిపత్రం సమర్పణ




పెద్దపల్లి,అక్టోబర్17: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాల వల్ల రాష్ట్రంలో అన్నదాతలు సాగునీరు,నాణ్యమైన విద్యుత్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సురేష్ రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్కూరి సత్యనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రాష్ట్ర కిసాన్ మోర్చా పిలుపు మేరకు శనివారం పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయాల సముదాయం ఎదుట రైతులతో కలిసి బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.అనంతరం జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్ కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా గొట్టిముక్కల సురేష్ రెడ్డి, కట్కూరి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రైతే రాజు అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రాష్ట్రంలో కరవు పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికందే పొట్టదశలో ఉన్న పంట పొలాలకు నరైన నమయానికి సాగునీరు,విద్యుత్ ఇవ్వకుండా రైతుల నోటికాడి బుక్కను లాక్కుంటున్నారని మండివడ్డారు.విద్యుత్ ఎవ్వుడు వస్తుందో,ఎప్పుడు పోతుందో తెలియని అస్తవ్యస్త పరిస్థితి నెలకొందని, గతంలో మాదిరిగా సరఫరా వేళలపై ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా గంటల తరబడి కోతలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మరోవైపు సాగునీటి విడుదల విషయంలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే ద్రామాలు ఆడుతున్నారని,కెనాల్స్ ద్వారా నీళ్లు వచ్చే సమయానికి వెళ్లి తానే తెప్పించినట్లు బిల్డప్ ఇస్తున్నారని విమర్శించారు.గతంలో ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేస్తే 48 గంటల్లో పెద్దవల్లికి చేరేదని,నేడు నాలుగు రోజులైనా సక్రమంగా చేరని దుస్థితి నెలకొందని ఆరోపించారు. కుమ్మరికుంట నుండి 6 గంటల్లో రావాల్సిన నీరు 12 గంటలు దాటినా రాలేదని, ముఖ్యంగా ఆర్-4 సబ్ కెనాల్‌తో పాటు ఇతర ఉప కాలువల చివరి ఆయకట్టుకు ఇప్పటివరకు చుక్క నీరు కూడా అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోళ్లలో క్వింటాలుకు రూ.150 నుంచి రూ.200 వరకు మిల్లర్లు అక్రమ కోతలు పెడుతుంటే గతంలో తాము కోర్టుకెళ్లి రైతుల పక్షాన పోరాడామని గుర్తుచేశారు.ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి క్షేత్రస్థాయి వరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని,పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంతో పాటు నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్,యువ మోర్చా అధ్యక్షులు రామగిరి అఖిల్,కందుల శ్రీనివాస్,కల్లేపల్లి అంజి,వేణు, కుమార్,అన్వేష్ తోపాటు మండల పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శ్రీ వాసవి ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారికి గాజుల అలంకరణ - సువర్ణ పుష్పార్చన, విశేష ఫల నివేదన



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజాకలం):- పట్టణంలోని శ్రీ వాసవి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి గాజుల అలంకరణ, సువర్ణ పుష్పార్చన, విశేష ఫల నివేదన కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొనగా, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు–సంతోషిని, బాశెట్టి హరీశ్–స్రవంతి, అరిగెల శివకుమార్–భూలక్ష్మి, చింతలవ కుమార్–చంద్రకళ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వాసవి దేవాలయ అధ్యక్షుడు చాడ సురేశ్, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్మీ రవికుమార్, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, చిట్టిమిల్లి శ్రీనివాస్, జొన్న శ్రీనివాస్, నరేంద్రుల రవికుమార్‌తో పాటు ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పి ఆర్ టి యు రాష్ట్ర కార్యదర్శిగా రాజ్ కుమార్ యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక

ధర్మారం, అక్టోబర్ 17 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఈరవేణి రాజకుమార్ యాదవ్ పి ఆర్ టి యూ రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. నల్లగొండ జిల్లాలో నిర్వహించిన పి ఆర్ టి యు రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో ఆయన ఎన్నిక జరిగింది. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, విద్యారంగ అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషి అంకితభావం నాయకత్వం లక్షణాలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు ఈరవేని రాజకుమార్ యాదవ్ తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, విద్య ప్రమాణాల పెంపుదల, తో పాటు విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని ఈరవేణి రాజకుమార్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తన ఎన్నిక కు సహకరించిన పి ఆర్ టి యు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి తో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిల కు ఈరవేణి రాజ్ కుమార్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



తాగునీటికే పచ్చజెండా.. వరి సాగుకు ఎరుపు గీత

రైతులకు ప్రత్యామ్నాయ పంటలు,మద్దతు ధర భరోసా – నాలుగు జిల్లాల కలెక్టర్లతో ఉన్నత స్థాయి సమీక్ష




పెద్దపల్లి,అక్టోబర్ 17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని,యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా విస్తృత అవగాహన కల్పించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి బెన్హార్ మహేష్ దత్ ఎక్కా ఆదేశించారు.శనివారం కరీంనగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్లు గరీమ అగర్వాల్,బి.సత్యప్రసాద్,కోయ శ్రీహర్ష,చిత్ర మిశ్రాలతో కలిసి వ్యవసాయ, నీటిపారుదల,విద్యుత్,తాగునీటి సరఫరాపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ కృష్ణా,గోదావరి బేసిన్లలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున అందుబాటులో ఉన్న జలాలను రానున్న వర్షాకాలం వరకు తాగునీటి కోసమే పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.గ్రామస్థాయిలో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న, పప్పుధాన్యాలు,నూనెగింజలు,కూరగాయల సాగును ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.ప్రత్యామ్నాయ పంటలకు కనీస మద్దతు ధర లభించేలా మార్కెటింగ్ శాఖ పర్యవేక్షించాలని,అవసరమైతే ప్రభుత్వం జోక్యం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కాలువల ద్వారా విడుదల చేసే నీరు చివరి ఆయకట్టు దాకా చేరేలా చర్యలు చేపట్టాలని,విద్యుత్ అంతరాయాలు రాకుండా ట్రాన్స్‌కో,డిస్కంల పరిధిలోని సమన్యలను యుద్ధప్రాతివదికన పరిష్కరించాలని సూచించారు.గ్రామీణ ఉపాధి హామీ ద్వారా ఫామ్ పాండ్లు,ఇంకుడు గుంతలు,బోరు రీఛార్జ్ పనులతో భూగర్భ జలాలను పెంపొందించాలని,మున్సిపాలిటీల్లో అమృత్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

పెద్దపల్లిలో సాధారణ పరిస్థితులు: కలెక్టర్ కోయ శ్రీహర్ష

సమీక్షలో పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఎక్కడా పంటలు ఎండిపోలేదని,శ్రీరామసాగర్ పరిధిలోని ఆయకట్టుకు నీరందిస్తూ పంటలను కాపాడుతున్నామని తెలిపారు. ఎల్లంపల్లిలో 18.17 టీఎంసీల నీరు నిల్వ ఉందని వివరించారు. యాసంగిలో వరి సాగును నివారించేందుకు డీలర్ల ద్వారా ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని,క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.అలాగే విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతానికి కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు,సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో నాలుగు జిల్లాల అదనపు కలెక్టర్లు,ఆర్డీవోలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వడి కృష్ణారావు

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 17(ప్రజా కలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని దబ్బా. గ్రామంలో దుర్గాదేవి కమిటీ ఆదర్శయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నఅన్న వితరణకు విచ్చేసినటువంటి జువ్వాడి కృష్ణారావుని దుర్గాదేవి కమిటీ క్యాషియర్ నేరేళ్ల రాజ్ కుమార్ గౌడ్ మరియు ఆదర్శ యూత్ సభ్యులందరూ శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో దబ్బా సర్పంచ్ పుప్పాల లక్ష్మి మహేష్,మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్.హైకోర్టు అడ్వకేట్ రాపెల్లి శివకుమార్.మాజీ సర్పంచ్ లింగంపల్లి గంగాధర్.బిసి సెల్ అధ్యక్షుడు భూస రాజేశ్వర్, ఎస్సై బొజ్జ మహేష్.మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఏలాల వెంకట్ రెడ్డి అమ్మకపేట సర్పంచ్, కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జాన శంకర్, దుద్దులు లింగన్న, శోభన్, యూత్ సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఆయుష్ మిషన్‌లో ఉద్యోగాల భర్తీ

- అక్టోబర్ 22 నుంచి 27 వరకు దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జి.ఎన్.అరుణ



పెద్దపల్లి,అక్టోబర్ 17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిన వైద్య అధికారులు (03),ఫార్మాసిస్ట్ (01), మానసిక సాంఘిక సలహాదారు (01), యోగా నిపుణుడు (01) ఉద్యోగాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆయుష్ సమన్వయ అధికారి డాక్టర్ జి.ఎన్. అరుణ తెలిపారు.సంబంధిత విద్యా అర్హతలు ఉండి,18 నుంచి 44 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు జిల్లా అధికారిక అంతర్జాల వేదిక (https://www.peddapalli.telangana.gov.in) నుంచి దరఖాస్తు పత్రాన్ని పొందవచ్చునని సూచించారు.అభ్యర్థులు రూ.300ల రుసుమును నిర్ణీత బ్యాంకు ఖాతాకు చెల్లించిన పత్రంతో పాటు,తమ విద్యా,కుల,నివాస ధ్రువీకరణ ప్రతులను జతచేసి అక్టోబర్ 22 నుంచి 27 సాయంత్రం 5 గంటల లోపు పెద్దపల్లి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో స్వయంగా గానీ,తపాలా ద్వారా గానీ అందజేయాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువు దాటిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని,ప్రతిభ మరియు రిజర్వేషన్ నిబంధనల మేరకు ఎంపికైన వారి వివరాలను జిల్లా అధికారిక వేదికపై ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

- జర్నలిస్టులపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను వెంటనే విధుల నుంచి తొలగించాలి



ఎండపల్లి, అక్టోబర్ 17 : (ప్రజా కలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంభీరావుపేట మండలం లో జర్నలిస్టులపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను వెంటనే విధుల నుంచి తొల గించాలని నల్ల బ్యాడ్జిల తో నిరసన వ్యక్తం చేసిన ఎండపల్లి మండల ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి మోకేనపల్లి సతీష్, ఎండపల్లి మండల అధ్యక్షులు చెన్న కుమారస్వామి, ఉపాధ్యక్షులు దొనకొండ శంకర్, అధికార ప్రతినిధి ఎనగందుల సంతోష్, చర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు చుంచు అనిల్, ఎమ్మార్పీఎస్ నాయకులు చెన్న సతీష్, సత్తయ్య, సీపెల్లి ప్రశాంత్, కనుకుట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దసరా బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి,అక్టోబర్ 17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) దసరా,బతుకమ్మ పండుగల వేళ పెద్దపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న ఉత్సవాల ఏర్పాట్లను శనివారం ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు స్థానిక ప్రజాప్రతినిధులు,మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రావణ దహనం ఏర్పాట్లతో పాటు,ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద చేపట్టిన బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.దసరా పర్వదినాన జూనియర్ కళాశాల మైదానంలో అత్యంత వైభవంగా నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు,పట్టణవాసులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.అనంతరం పట్టణ శివారులోని నిమ్మనపల్లి–నిట్టూరు రోడ్డు మార్గంలో రైతుల పొలాలకు,ఎల్లమ్మ గుండమ్మ చెరువులోకి నీరు చేరే కాలువ తూమును స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.సాగునీటి సరఫరాకు ఎక్కడా ఆటంకం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కమిషనర్,వార్డు కౌన్సిలర్లు,సింగిల్ విండో చైర్మన్,పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడి కల

నెరవేర్చిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కందాళ!

పాలేరు అక్టోబర్ 17 (ప్రజా కలం న్యూస్) కూసుమంచి: మండలం పరిధిలోని నరసింహులగూడెం గ్రామానికి చెందిన 13 ఏళ్ల వినయ్ బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. తన అభిమాన నాయకుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఫొటో దిగాలన్న వినయ్ కోరికను కుటుంబ సభ్యులు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హైదరాబాద్‌లోని కందాళ నివాసంలో వినయ్‌ను కేటీఆర్ ఆప్యాయంగా కలిసి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వైద్య సహాయానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తన కోరిక నెరవేరడంతో వినయ్, కుటుంబ సభ్యులు కేటీఆర్, కందాళ ఉపేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దావన్నపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ - ఏఐఎఫ్‌బీ పార్టీలో చేరిన గ్రామస్తులు



పెద్దపల్లి,అక్టోబర్ 17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

దావన్నపల్లి గ్రామం ఐకమత్యానికి నిలువెత్తు ప్రతీక అని,రానున్నది బీసీల రాజ్యమేనని,ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా ఎల్లప్పుడూ మీ ముందుండి నిలబడతానని ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ ఉద్ఘాటించారు.తనపై అపారమైన నమ్మకంతో ఇంతటి ప్రేమాభిమానాలను కురిపిస్తున్న దావన్నపల్లి గ్రామాన్ని జిల్లాలోనే అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని,అభివృద్ధి దిశగా తనతో కలిసి నడవాలని ఆయన గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.శనివారం గ్రామానికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు,కీలక నాయకులు, గ్రామస్తులు ముక్తకంఠంతో కొలిపాక శ్రీనివాస్ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.రానున్న 2028 శాసనసభ ఎన్నికల్లో కొలిపాక శ్రీనివాస్ ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే లక్ష్యంగా,గ్రామం మొత్తం ఆయన వెంటే నిలుస్తుందని స్పష్టం చేస్తూ భారీ ఎత్తున ఏఐఎఫ్‌బీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.స్థానిక వార్డు సభ్యులు ఆసంపల్లి రామ్మోహన్, లక్ష్మి–రమేష్,దొడ్ల రిషిత– సతీష్,సర్పంచ్ అభ్యర్థి దొడ్ల రామకృష్ణ,దావన్నపల్లి ఆలయ చైర్మన్ మద్దెల మల్లయ్యలతో పాటు గ్రామ పెద్దమనుషులు,యువకులు,మహిళలు కొలిపాక శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు.గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి,ప్రజా సంక్షేమానికి శ్రీనివాస్ నాయకత్వమే సరైన మార్గమని ఈ సందర్భంగా చేరిన నాయకులు స్పష్టం చేశారు.

రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

- పెద్దపల్లికి చేరుకున్న సాదిక్ ఫౌండేషన్ ప్రజా యాత్ర



పెద్దపల్లి,అక్టోబర్ 17:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితుల్లో చిక్కుకున్న రైతాంగానికి ప్రభుత్వం తక్షణమే భరోసా కల్పించాలని హైకోర్టు న్యాయవాది,సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ డిమాండ్ చేశారు. రైతుల,భూ హక్కుల పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా అక్టోబర్ 12న ప్రారంభమైన సాదిక్ ఫౌండేషన్ 14 రోజుల ప్రజా యాత్ర జనగామ,సిద్దిపేట,సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల మీదుగా శనివారం పెద్దపల్లి జిల్లాకు చేరుకుంది.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరువు నివారణకు అందరి సహకారం కావాలని సీఎం కోరడం మంచిదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పల్లెల్లో పర్యటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సిద్దిపేట జిల్లా లెనిన్ గ్రామం,నిజామాబాద్ జిల్లా సిర్నాపల్లి తండాలు,పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం ఈదులాపూర్‌లో ఎండిపోయిన పంటలను చూసి చలించి పోయామని, కేవలం ఉపాధి హామీ నిధులతో కరువును ఎదుర్కోలేమని,కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు పేద రైతులను యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని కోరారు.అలాగే భూభారతి, 22–ఏ భూసమస్యలను గ్రామ,ల్వార్డు సభల ద్వారా కలెక్టర్ పర్యవేక్షణలో పరిష్కరించాలని,పేదల అసైన్డ్ భూములకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని, కేంద్ర కులగణనలో బీసీ పదాన్ని చేర్చడంతో పాటు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని,ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ యాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన పెద్దపల్లి జిల్లా భూరక్షణ సమితి అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో భూరక్షణ సమితి కార్యవర్గ సభ్యులు కే.రాజు,సాదిక్ ఫౌండేషన్ ప్రతినిధులు, కళాకారుల బృందం తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మెడికవర్ హాస్పిటల్ మోటోభారత్ ఆధ్వర్యంలో వరల్డ్ ట్రామా డే బైక్ రైడ్

రోడ్డు భద్రతపై అవగాహన – ప్రమాదాల నివారణే లక్ష్యంగా 150 బైక్‌లతో ర్యాలీ



హనుమకొండ అక్టోబర్ 17 ప్రజా కలం ప్రతినిధి

రోడ్డు భద్రత,బాధ్యతాయుతమైన డ్రైవింగ్,రోడ్డు ప్రమాదాల నివారణ, అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్య చికిత్స ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మెడికవర్ హాస్పిటల్స్,వరంగల్ మోటోభారత్ వరంగల్ సంయుక్తంగా వరల్డ్ ట్రామా డే సందర్భంగా బైక్ రైడ్ నిర్వహించాయి.ఈ కార్యక్రమంలో సుమారు 150 బైక్‌లు పాల్గొని,రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రాణనష్టాన్ని తగ్గించాలనే సందేశాన్ని ప్రజలకు అందించాయి.ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు ట్రామా (ప్రమాదాల కారణంగా సంభవించే తీవ్రమైన గాయాలు) గురించి అవగాహన కలిగి ఉండటం,రోడ్డు ప్రమాదాలను నివారించడం,ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించడం వంటి అంశాల ప్రాముఖ్యతను వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం,హెల్మెట్ ధరించడం, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం, బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం ద్వారా తీవ్రమైన గాయాలు, ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ దినేష్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు డాక్టర్ వరుణ్,ఆర్థోపెడిక్స్ వైద్యులు డాక్టర్ దయాసాగర్ రెడ్డి, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు పాల్గొని ప్రసంగించారు.ట్రామా వల్ల మానవ జీవితంపై పడే ప్రభావం, ప్రమాదాల కారణంగా ఎదురయ్యే తీవ్రమైన గాయాలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు,ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించడం వంటి అంశాలపై వారు అవగాహన కల్పించారు.ప్రమాదాలను నివారించడంతో పాటు అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండటం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీల నిర్వహణ

విజేతగా శ్రీరామ్ నగర్ జట్టు - ప్రథమ,ద్వితీయ బహుమతులు అందజేసిన కొత్తగట్టు శ్రీనివాస్



వాజేడు అక్టోబర్ 17 (ప్రజాకలం) విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చెరుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రెగు లపాడు వాలీబాల్ కోర్టులో నిర్వహించిన “గ్రామ పంచాయతీ స్థాయి వాలీబాల్ పోటీలు 2026” శనివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలలో వివిధ గ్రామాల నుంచి మొత్తం 8 జట్లు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచాయి. శనివారం సాయంత్రం జరిగిన హోరాహోరీ ఫైనల్ సమరంలో శ్రీరామనగర్ జట్టు మొదటి స్థానం సాధించి ఛాంపియన్‌గా నిలవగా, ఆతిథ్య రెగ్యులపాడు జట్టు రెండవ స్థానం (రన్నరప్), అలాగే బయ్యారం జట్టు మూడవ స్థానం కైవసం చేసుకున్నాయి. అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో విజేతలకు నగదు బహుమతులు మరియు జ్ఞాపికలు అందజేశారు. ప్రథమ బహుమతిని గ్రామ పెద్దలు మరియు నిర్వాహక కమిటీ సభ్యులు అందజేయగా, ద్వితీయ బహుమతిని నవనిర్మాణ సేన తరఫున, తృతీయ బహుమతిని కమిటీ సభ్యులు అందజేశారు. పోటీల ప్రధాన ఆకర్షణగా నిలిచిన విజేతల ట్రోఫీలను శ్రీ వెంకటేశ్వర బోర్‌వెల్స్ అధినేత కొత్తగట్టు శ్రీనివాస్ గారు స్పాన్సర్ చేశారు. ప్రథమ బహుమతి షీల్డ్‌ను దివంగత శ్రీమతి కొత్తగట్టు రాజేశ్వరి (సారలమ్మ) బాల గారి జ్ఞాపకార్థం, ద్వితీయ బహుమతి షీల్డ్‌ను దివంగత శ్రీ కొత్తగట్టు కృష్ణమూర్తి గారి జ్ఞాపకార్థం వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో జజ్జేరి సాయిబాబు, పూనెం సతీష్ కుమార్, వాసం నరసింహమూర్తి, నవనిర్మాణ సేన ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి సాగర్, వాజేడు మండల ఉప ఉపాధ్యక్షులు శ్రీనివాస్ బోర్‌వెల్ కొత్తగట్టు శ్రీనివాస్ గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, క్రీడాకారులు మరియు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడల ద్వారా యువతలో ఐక్యత, క్రమశిక్షణ పెంపొందించడం అభినందనీయమని అతిథులు కొనియాడారు.

అమ్మవారిని దర్శించుకున్న మెట్పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కోన గోవర్ధన్...



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 17(ప్రజా కలం ప్రతినిధి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో శివాలయం మరియు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దుర్గా దేవి కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకున్నా మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ దంపతులుఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్,కూన సాయితేజ దుర్గా దేవి కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

మల్లాపూర్, అక్టోబర్ 17 (ప్రజా కలం ప్రతినిధి): పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎస్పీ రాములు సూచించారు. ఈ మేరకు శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల వివరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని, ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని ఎస్సై అనిల్ కుమార్ కు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ తనిఖీలో మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు, మెట్‌పల్లి ఎస్సై కిరణ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్సై నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

మెట్‌పల్లి లో స్నేహా స్కానింగ్ సెంటర్‌ను సందర్శించిన డాక్టర్ రఘు

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి అక్టోబర్ 17 (ప్రజాకలం):- పట్టణంలో డాక్టర్ ఆడెపు స్నేహ, రేడియాలజిస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహా స్కానింగ్ సెంటర్‌ను తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు శనివారం సందర్శించారు. ఈ నెల 15న నిర్వహించిన స్కానింగ్ సెంటర్ ప్రారంభోత్సవం అనంతరం ఆయన కేంద్రాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నూతనంగా స్కానింగ్ సెంటర్ అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆడెపు స్నేహకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ స్నేహా స్కానింగ్ సెంటర్ మరింత అభివృద్ధి చెందాలని డాక్టర్ రఘు ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు

మూడు బొమ్మల మేడిపల్లిలో ఘనంగా దేవి నవరాత్రోత్సవాలు



మెట్‌పల్లి రూరల్ అక్టోబర్ 17:(ప్రజా కలం);మెట్‌పల్లి మండల పరిధిలోని మూడు బొమ్మల మేడిపల్లి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. (ఏ.వై.ఎస్) భీమ్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాన్ని వేద పండితులు కిశోర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రుల విశిష్టతను, జగన్మాత అనుగ్రహ ప్రాశస్త్యాన్ని భక్తులకు పూసగుచ్చినట్లు వివరించారు. అమ్మవారిని భక్తితో ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ కుంకుమార్చన మహోత్సవంలో గ్రామ మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియడంతో ఉత్సవ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ ప్రముఖులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అబుదాబి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ అభినవ్ భాస్కర్

హనుమకొండ అక్టోబర్ 17 ప్రజా కలం ప్రతినిధి తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అబుదాబిలోని ఇండియన్ సోషల్ అండ్ కల్చరల్ సెంటర్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంబసీ ఆఫ్ ఇండియా కౌన్సలర్ సౌమ్య గుప్తా,డా.బాలాజీ రామస్వామి,ఇండియన్ సోషల్ అండ్ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు బిజి థామస్ కలిసి పాల్గొన్న GWMC 60వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్,బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్.ఆర్.ఐ సెల్ కో కన్వీనర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్ తెలంగాణ సంస్కృతిని చాటేలా మహిళలు అందమైన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొని సంప్రదాయ నృత్యాలు చేశారు.ప్రముఖ కళాకారుడు డాక్టర్ కోకిల నాగరాజు నృత్య దర్శకత్వంలో వచ్చిన ప్రదర్శనలు,గాయకులు అంజలి పులింటి,సోనీ యాదర్ల,సోనీ పటేళ్ల ఆటపాటలు ప్రేక్షకులను ఎంతగానోఆకట్టుకున్నాయి.సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మలు తెచ్చిన మహిళలకు,సంప్రదాయ దుస్తులు ధరించిన చిన్నారులకు నిర్వాహకులు ప్రత్యేక బహుమతులు అందజేశారు.తెలంగాణ సంస్కృతిని పరిరక్షించేందుకే గత పది సంవత్సరాలుగా ఇలాంటి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎఫ్ఐఏ అధికార ప్రతినిధి రాజా శ్రీనివాస రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఐఏ ప్రతినిధులు శ్రీనివాస్,గంగారెడ్డి, వంశీ,అశోక్,జగదీశ్, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్మోతో ఊపిరితిత్తుల మార్పిడికి కొత్త ఆశలు

చివరి దశ ఊపిరితిత్తుల వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు అత్యాధునిక వైద్యం
యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ



హనుమకొండ అక్టోబర్ 17 ప్రజా కలం ప్రతినిధి

తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న రోగులకు ఎక్మో విధానం ప్రాణాధారంగా నిలుస్తోందని హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ కన్సల్టెంట్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాత్రగడ్డ తెలిపారు.వరంగల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. చివరి దశ ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న తగిన రోగులకు ఎక్మో సహాయంతో ఊపిరితిత్తుల మార్పిడి చేసే అవకాశాలు ఈ చికిత్సలో ఆధునిక వైద్య సాంకేతికత ప్రాధాన్యత గురించి వివరించారు.చివరి దశ ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ లేదా తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం కారణంగా ఊపిరితిత్తులు శరీరానికి సరిపడా ఆక్సిజన్‌ను అందించలేని పరిస్థితుల్లో వెనో-వీనస్ ఎక్మో చికిత్సను ఉపయోగించవచ్చని డాక్టర్ తపస్వి వివరించారు.ఈ విధానంలో శరీరం వెలుపల ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రం కృత్రిమ ఊపిరితిత్తుల మాదిరిగా పనిచేస్తుంది.రక్తంలో ఆక్సిజన్ స్థాయిని పెంచి,కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించి,ఆ రక్తాన్ని తిరిగి శరీరంలోకి పంపిస్తుంది.దీంతో తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం ఉన్న కొంతమంది రోగులకు అవసరమైన ప్రాణాధార సహాయం అందుతుంది.ఊపిరితిత్తుల మార్పిడి అవసరమైన ఎంపిక చేసిన రోగులకు దాత ఊపిరితిత్తులు లభించే వరకు ప్రాణాధార సహాయం అందించడంలో ఎక్మో కీలక పాత్ర పోషించవచ్చని ఆమె తెలిపారు. ఈ విధానాన్ని వైద్య పరిభాషలో 'బ్రిడ్జ్ టు ట్రాన్స్‌ప్లాంట్' అని పేర్కొన్నారు.ఊపిరితిత్తుల మార్పిడిలో వైద్య బృందాల సమన్వయం కీలకం ఎక్మో సహాయంతో ఉన్న రోగులకు రెండు ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని డాక్టర్ తపస్వి తెలిపారు.ఈ సమయంలో రక్తస్రావం, రక్తం గడ్డకట్టడం వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సి ఉంటుందని వివరించారు. గుండె-ఊపిరితిత్తుల నిపుణులు, మత్తుమందు వైద్యులు, అత్యవసర చికిత్సా విభాగం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ఈ చికిత్సలో ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.అనంతరం రోగి కోలుకోవడానికి నిరంతర వైద్య పర్యవేక్షణ,అత్యవసర చికిత్సా సదుపాయాలు,తగిన పునరావాస కార్యక్రమాలు అవసరమని డాక్టర్ తపస్వి వివరించారు.రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎక్మో, వెంటిలేటర్ సహాయాన్ని దశలవారీగా తగ్గిస్తూ, కొత్త ఊపిరితిత్తులతో స్వయంగా శ్వాస తీసుకునేలా వైద్య బృందం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో శారీరక పునరావాస కార్యక్రమాలు నిర్వహించి, రోగులు తమ దైనందిన కార్యకలాపాలకు తిరిగి అలవాటు పడేలా సహాయం అందిస్తారని వివరించారు.ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల రోగులకు ఆధునిక ఊపిరితిత్తుల వైద్య సేవలు,మార్పిడి చికిత్సపై అవగాహన కల్పించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ - మెడికల్ సర్వీసెస్ డాక్టర్ జీవన్ ఏ, మార్కెటింగ్ మేనేజర్ పి.సంజీవ్ కుమార్,అసిస్టెంట్ మేనేజర్ రమేష్‌తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

అడెల్లి గంగనీళ్ల జాతరకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



నిర్మల్ అక్టోబర్ 17 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామ సమీపంలోని గోదావరి నది వద్ద నిర్వహించనున్న అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర సందర్భంగా 250 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బందోబస్తు విధులకు కేటాయించిన పోలీసు అధికారులు, సిబ్బందితో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, బ్రీఫింగ్ సమావేశం నిర్వహించి, విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, గోదావరి నది పరిసరాల్లో భద్రత, అవాంఛనీయ ఘటనల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి అధికారి, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో విధులు నిర్వహించాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణమే స్పందించాలని సూచించారు.

భక్తులకు పోలీసుల ముఖ్య సూచనలు:

- గోదావరి నదిలో స్నానం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకూడదు.
- పోలీసు సిబ్బంది సూచనలను తప్పనిసరిగా పాటించాలి.
- రద్దీ ప్రాంతాల్లో తోపులాటకు పాల్పడకుండా క్రమపద్ధతిలో ముందుకు సాగాలి.
- పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టకూడదు.
- వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదు.
- మద్యం సేవించి నదిలోకి దిగకూడదు. నీటి లోతు తెలియని ప్రాంతాల్లోకి వెళ్లకూడదు.
- అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలి.
- నగలు, నగదు, మొబైల్ ఫోన్లు వంటి విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. భక్తులందరూ పోలీసులకు సహకరిస్తూ భద్రతా సూచనలు పాటించాలని, అడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్‌తో పాటు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాల్లో పార్కింగ్ తప్పనిసరి

రోడ్లపై పశువులు వదిలితే యజమానులకు జరిమానా - ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం.. వీడీసీల ఇసుక వేలం సహించేది లేదు
భూభారతి', 'ప్రజావాణి' దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అక్టోబర్ 17 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. వ్యాపార సముదాయాలకు తప్పనిసరిగా పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లపై ఆక్రమణలు, పశువుల సంచారం, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. పార్కింగ్ సదుపాయం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపార సముదాయాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల కారణంగా ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే యజమానులకు జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను 'బ్లాక్ స్పాట్లు'గా గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులు, ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా భారీ వాహనాలను నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల నిర్మాణ పనులకు కూడా నిబంధనలకు అనుగుణంగానే ఇసుకను వినియోగించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు (వీడీసీ) ఇసుక వేలం నిర్వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వీడీసీలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం: ఎస్పీ

జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయ, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గంజాయి సాగు, విక్రయాలను అరికడుతున్నామని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'భూభారతి', 'సీఎం ప్రజావాణి'లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్రా రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనకు విస్తృత చర్యలు : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, అక్టోబర్ 17(ప్రజా కలం న్యూస్)

జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగం, విక్రయాలను అరికట్టడానికి పోలీసు, ఎన్‌ఫోర్స్‌మెంట్, వైద్య-ఆరోగ్య, విద్య శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కలెక్టర్, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఎన్‌కార్డ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా జిల్లాలోని పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగంతో చదువులో వెనుకబడి, భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. మత్తు కోసం డబ్బుకోసం నేరాలకు, దొంగతనాలకు పాల్పడే అవకాశం పెరుగుతుందని, కుటుంబాల్లో గొడవలు, మానసిక ఒత్తిడి, బంధాలు దెబ్బతింటాయని అన్నారు. మంచి సమాజం కొరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై దృష్టి పెట్టాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 55 గంజాయి/డ్రగ్స్ కేసులు నమోదు చేయగా, 137 మంది నిందితులను అరెస్టు చేశారన్నారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు మార్గాలు, జిల్లాలోని అంతర్రాష్ట్ర రవాణా మార్గాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. లికేసులలో మూలాలు, సరఫరాదారులు, కొనుగోలుదారులను పూర్తి స్థాయిలో గుర్తించి, ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాల వద్ద ప్రత్యేక పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. స్కూల్స్ వద్ద చాక్లెట్ల అమ్మకాలపై నిఘా పెట్టాలని, తరచు దాడులు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జిల్లాలోని పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇప్పటివరకు 57 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో యాంటీ-డ్రగ్ క్లబ్‌ల ఏర్పాటు, నిర్వహణను నిర్బంధం చేయాలన్నారు. కళాశాలల నుండి హై స్కూల్ ల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని



అన్నారు.డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సెలింగ్, వైద్య చికిత్స, పునరావాసం కల్పించేందుకు జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రత్యేక డీ-అడిక్షన్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా షెడ్యూల్డ్ మత్తు బిళ్ళలు, ప్రిస్క్రిప్షన్ మందులు విక్రయించే మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.హోమాదక ద్రవ్యాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు, తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1908 కి సమాచారం అందించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం. ఫిరంగి, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర రావు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు దేవేందర్ రెడ్డి, అనిల్, ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. జి. వీరన్న, పోలీస్ ఇన్స్పెక్టర్ వి. విజయ రాంకుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 17:

ఎస్ఐఆర్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు.శనివారం, ఎస్ఐఆర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా నుండి కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను త్వరితగతిన పూర్తి చేసి, అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఓటర్ల అర్హతలను నిర్ధారించే సమయంలో సంబంధిత పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన వారికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూడాలని తెలిపారు.ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు, అనర్హమైన నమోదు (లేదా) డూప్లికేట్ వివరాలు లేకుండా బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని దరఖాస్తులు, ఓటర్ల వివరాలకు సంబంధించిన రికార్డులను భౌతిక పత్రాల రూపంలో సక్రమంగా నిర్వహించి, భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరచాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ దరఖాస్తులను ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో క్షుణ్ణంగా పరిశీలించి, నకిలీ, తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులు లేకుండా అర్హతలను నిర్ధారించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ జె . ఎల్.బి హరిప్రియ మాట్లాడుతూ.. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి, పెండింగ్ లో లేకుండా నిర్దేశిత గడువులోగా వరిష్కరించాలని నంబంధిత అధికారులను అదేశించారు.మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న నోటీసుల జారీ, వాటి పంపిణీ, విచారణలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రతి అధికారి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

ఓటరు జాబితాలో చేర్చేందుకు అర్హత ఉన్న వారి వివరాలను పరిశీలించి, సంబంధిత ప్రక్రియ పూర్తయిన వెంటనే తుది ఓటరు జాబితాలోకి చేర్చాలని ఆదేశించారు. నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీ కేటగిరీల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, అవసరమైన ధ్రువీకరణల అనంతరం పరిష్కరించాలని సూచించారు. అనర్హులుగా గుర్తించిన కేసుల్లో నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించి, సంబంధిత ఆధారాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్‌ను ఏఈఆర్ఓ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పరిష్కరించి, తదుపరి సమీక్షా సమావేశం నాటికి స్పష్టమైన పురోగతి చూపించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జాఫర్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, డిప్యూటీ తహశీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 21 నుండి జిల్లా వ్యాప్తంగా ఆర్థిక సమ్మిళిత సంతృప్త ప్రచారం కై ప్రత్యేక బ్యాంకింగ్ శిబిరాలు

పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, అటల్ పెన్షన్ యోజన నమోదు, ఖాతాల పునరుద్ధరణ, డిజిటల్ మోసాలపై అవగాహన కల్పనే లక్ష్యం : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, అక్టోబర్ 17(ప్రజా కలం న్యూస్)

కేంద్ర ఆర్థిక సేవల విభాగం ఆర్థిక మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో బ్యాంకింగ్, సామాజిక భద్రతా పథకాలను చేరువ చేసేందుకు అక్టోబర్ 21, 2026 నుండి డిసెంబర్ 31, 2026 వరకు ప్రత్యేక ఆర్థిక సమ్మిళిత సంతృప్త ప్రచారం శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో గల మొత్తం 571 గ్రామ పంచాయతీలు, పరిధిలోని సంబంధిత బ్యాంకులకు కేటాయించిన గ్రామాల్లో కనీసం ఒక శిబిరం చొప్పున షెడ్యూల్ ప్రకారం ఈ క్యాంపులు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఇట్టి శిబిరాల్లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద అర్హులైన 18 నుండి 50 సంవత్సరాల వారికి జీవన బీమా నమోదు, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన కింద 18 నుండి 70 సంవత్సరాల వారికి ప్రమాద బీమా సౌకర్యం, అటల్ పెన్షన్ యోజన కింద అసంఘటిత రంగ కార్మికులు, వృద్ధాప్య భద్రత కోసం 18 నుండి 40 ఏళ్ల లోపు వారికి స్థిర పింఛను నమోదు సేవలు చేపడతారని కలెక్టర్ వివరించారు. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన కింద కొత్త జీరో బ్యాలెన్స్ పొదుపు ఖాతాల ప్రారంభం, నిద్రాణంగా ఉన్న ఖాతాల పునరుద్ధరణలు చేస్తారన్నారు. బ్యాంక్ ఖాతాలకు సీడింగ్ ప్రక్రియలు, నామినేషన్ వివరాల నమోదు, సవరణ చేపడతారని తెలిపారు. రీ-కేవైసీ, సెంట్రల్ కేవైసీ ప్రక్రియలను పూర్తి చేస్తారని అన్నారు.ఇట్టి శిబిరాల్లో కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పథకాలపై విస్తృత అవగాహన సదస్సులు, సైబర్ నేరాలు, డిజిటల్ ఆర్థిక మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. శిబిరాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీ భవనాలలో సౌండ్ సిస్టమ్, కుర్చీలు, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించాలని, దండోరా లేదా ఇతర మాధ్యమాల ద్వారా గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, డిఆర్డిఏ/సెర్ప్, మెప్మా తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులను, మహిళా సంఘాల సభ్యులను ఈ శిబిరాలకు తరలించాలని సూచించారు.బ్యాంకుల నుండి నియమించబడిన అధికారులు, సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ సిబ్బంది ఆయా శిబిరాల్లో నేరుగా అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించి సేవలు అందిస్తారని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రజలందరూ తమ తమ గ్రామాల్లో నిర్వహించే ఈ శిబిరాల తేదీలను తెలుసుకొని, సంబంధిత గుర్తింపు పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో హాజరై కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలను, బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేంతవరకు పోరాటం

- ఆర్టీసీ ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్-ఏఐటీయూసీ జేఏసీ కూటమి విజయం

- కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు కల్పించాలి - సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్. ఆనంద్



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 17 (ప్రజాకలం):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)-ఏఐటీయూసీ జేఏసీ కూటమి బస్సు గుర్తుపై రాష్ట్ర గుర్తింపు సంఘంగా విజయం సాధించారు. ఈ సందర్భంగా శనివారం నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్-ఏఐటీయూసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు నంబరాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

నాగర్‌కర్నూల్ డిపో మాజీ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు హెచ్. ఆనంద్ మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేంతవరకు కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)-ఏఐటీయూసీ నాగర్‌కర్నూల్ డిపో అధ్యక్షుడు కే. భాస్కర్ రెడ్డి, ఏఐటీయూసీ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడుతామని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికులు, ఆర్టీసీలోని ఇతర ఉద్యోగులందరినీ కలుపుకొని కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగుతూ, హక్కులు సాధించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ డిపో ఎంప్లాయీస్ యూనియన్-ఏఐటీయూసీ నాయకులు జె.డి. నాయక్, కండక్టర్ డి. వాల్ నాయక్, డ్రైవర్, సుమలత, కండక్టర్, కే. లింగయ్య, కండక్టర్, ఎం.డి. జహీరుద్దీన్, కండక్టర్, ఏఐటీయూసీ నాయకులు కొత్త రామస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, ఈర్ల హుస్సేన్, సంగిశెట్టి విష్ణు, కోట్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల క్షేత్రాలను పరిశీలించిన జిల్లా ఉద్యాన,

పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్

మిరపలో నల్ల తామర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి రైతులకు సూచనలు.



పాలేరు అక్టోబర్ 17(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ శనివారం కూసుమంచి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సాగు చేస్తున్న మిరప, మునగ, బొప్పాయి, ఆయిల్‌పామ్ పంటల క్షేత్రాలను సందర్శించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఉద్యాన పంటల సాగుపై పడే ప్రభావాన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.మిరప సాగు చేస్తున్న రైతులు బిందు సేద్యం అందుబాటులో ఉంటే దాని ద్వారా పంటకు నీటి తడులు అందించాలని సూచించారు. బిందు సేద్యం ద్వారా నీటిని పొదుపు చేయడంతో పాటు పంటకు అవసరమైన సమయంలో తేమను అందించవచ్చని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మిరప పంటలో చీడపీడలు, తెగుళ్లు అధికంగా వ్యాపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మిరపలో నల్ల తామర పురుగు ఉధృతిని గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సలహాల మేరకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు మొక్కకు నాలుగు వైపులా సమానంగా నీరు అందేలా బిందు సేద్యం ద్వారా నీటి తడులు ఇవ్వాలని సూచించారు. పంట ఎదుగుదలకు అవసరమైన ఎరువులను నిర్ణీత మోతాదులోనే వినియోగించాలని, నీరు, ఎరువుల యాజమాన్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈ క్షేత్ర సందర్శనలో పాలేరు ఉద్యాన అధికారి పి. అపర్ణతో పాటు రైతులు శరత్, రాంగోపాల్, సాయికుమార్, రవి, రాజశేఖర్ రెడ్డి, రవీందర్, రామారావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్ల రద్దుకు ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలి

- అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలి

- అంగన్వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 17 (ప్రజాకలం):కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని అంగన్వాడీ, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మల్టిపుల్ డేస్ మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఆశా, అంగన్వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అసంఘటిత కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తోందని జయలక్ష్మి ఆరోపించారు. గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను 29 చట్టాలుగా మార్చి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చారని, దీనివల్ల కార్మికుల హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు. కనీస వేతనాల అమలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణపై ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు.గత 50 ఏళ్లుగా అంగన్వాడీ రంగంలో సేవలందిస్తున్న కార్యకర్తలకు కనీస వేతనాలు అందడం లేదని, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు అమలు చేస్తున్నప్పుడు తెలంగాణలో గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు ఎందుకు అమలు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయమైన వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర కార్మిక ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం లేదని ఆమె విమర్శించారు. కార్మికుల శ్రమను దోపిడీకి గురిచేసే విధానాలను విడనాడి, వారి హక్కులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మల్టిపుల్ డేస్ మహాధర్నాలో ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు పర్వతాలు, జిల్లా కోశాధికారి పొదిల రామయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి కళావతి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సీనియర్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, ఉపాధ్యక్షులు స్వప్న, శ్రీదేవి, శివ, లీల, రత్నమాల, కల్పన, భాగ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకటమ్మ, అంజనమ్మ, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి వేడుకలు

కాళరాత్రి అలంకరణలో సరస్వతి అమ్మవారు

నిర్మల్ ,అక్టోబర్ 17(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): బాసర పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ క్షేత్రంలో దేవి శరన్న నవరాత్రి ఉత్సవాల భాగంగా శనివారం అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూల నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకొని భారీ సంఖ్యలో భక్తులు తమ తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు దిద్దగా ఆలయానికి భారీ ఆదాయం సమకూరింది శనివారం కూడా అదే దశలో ఆదాయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేవట్టారు. ఈ నందర్భంగా బానర ఆలయంలోని

ఏడవరోజు కాళరాత్రి అలంకారనా చేయక భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా నవరాత్రుల్లో ఏడవ రోజు అమ్మవారిని కాళరాత్రిగా పూజిస్తారు

"కాళ" అనగా మృత్యువు, "రాత్రి" అంటే అజ్ఞానం, చీకటి. మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగిస్తుంది కావున అమ్మవారికి కాళరాత్రి అనే పేరు వచ్చింది.

ఈ అమ్మవారు చాలా భయంకరంగా శత్రు సంహారిణి గా ఉంటుంది. నల్లని రూపం, పొడవాటి జడలు కట్టిన కేశాలు, మెడలో పుర్రెలు, రక్తం తాగుతున్నట్టుగా, చతుర్భుజాలతో,గాడిద వాహనం తో భయం కలిగించేలా ఉంటుంది కానీ భక్తులకు ఆమె అభయప్రదాత. కాళికాదేవి శనిగ్రహానికి అధిపతి. ఈమె తన ఒక కుడిచేతి వరద ముద్ర ద్వారా అందరికీ వరాలను ప్రసాదిస్తుంది. మరోక కుడిచేత అభయముద్రను కలిగి ఉంటుంది. ఒక ఎడమచేతిలో ఇనుపముళ్ళ ఆయుధాన్నీ, మరొక ఎడమచేతిలో ఖడ్గాన్నీ ధరించి ఉంటుంది

నైవేద్యం : కదంబం (కిచిడి)

కాళరాత్రి దేవి ధ్యాన శ్లోకం :

ఏకవేణీ జపాకర్ణపురా నగ్నా ఖరస్థితా లంబోష్ఠీ కర్ణికాకర్ణీ తైలాభ్యక్తశరీరిణీ వామపాదోల్లసల్లోహలతాకంటక భూషణా వర మూర్ధధ్వజా కృష్ణా కాళరాత్రిర్భయంకరీ వేదమంత్రాలు మధ్య వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి అలంకరణతో భక్తులకు దర్శనం సౌభాగ్యాన్ని కలిగించారు



మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

నషాముక్త సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి

జక్కేపల్లిలో మేరా యువభారత్, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం



పాలేరు అక్టోబర్ 17(ప్రజా కలం న్యూస్)

జక్కేపల్లి ఎస్సీ కాలనీ గ్రామంలోని భారత ప్రభుత్వం మేరా యువభారత్ ఖమ్మం, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో జక్కేపల్లి గ్రామంలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం యువతలో సామాజిక బాధ్యత, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, నషాముక్త సమాజ నిర్మాణం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తంగెళ్ల లక్ష్మయ్య మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా కూడా తీవ్ర నష్టాలు కలుగుతాయని తెలిపారు. మాదకద్రవ్యాల బారినపడిన వారికి పునరావాస కేంద్రాల ద్వారా అందించే సహాయంపై అవగాహన కల్పించాలని కోరారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జక్కేపల్లి, ఎస్సీ కాలనీని బెల్ట్ షాపులు లేని గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు.

జిల్లా యువజన అధికారి (డీవైఓ) ఎం. వెంకట్ రాంబాబు మాట్లాడుతూ మేరా యువభారత్ ద్వారా యువతకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు, అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు మేరా యువభారత్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. యువజన, మహిళా సంఘాలు గూగుల్ లేదా క్రోమ్ ద్వారా మేరా యువభారత్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల యువత కోసం నిర్వహించే వివిధ కార్యక్రమాలు, వ్యానరచన పోటీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో నిర్వహించే యువజన మార్పిడి కార్యక్రమాల గురించి తెలునుకోవడం సులభమవుతుందని వివరించారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షుడు చింతమాల పాపయ్య మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక నష్టాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. యువజన, మహిళా సంఘాలు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేస్తూ నషాముక్త సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత ప్రతిరోజూ యోగా, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పానీయాలు, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ తంగెళ్ల లక్ష్మయ్య, ఉపసర్పంచ్ కె. నాగరాణిని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డీవైఓ ఎం. వెంకట్ రాంబాబు, గ్రామ సర్పంచ్ తంగెళ్ల లక్ష్మయ్య, ఉపసర్పంచ్ కె. నాగరాణి, పీఏసీఎస్ చైర్మన్ దారా జయశ్రీ, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షుడు చింతమాల పాపయ్య, స్పార్క్ యూత్ అధ్యక్షుడు దారా సందీప్ కుమార్, యువసేన యూత్ అధ్యక్షుడు దారా నరేష్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వైద్యులు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, గ్రామ దీపిక, ఆశా కార్యకర్తలు, కె. వెంకటరత్నం, గ్రామ పెద్దలు, యువతీ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ వేడుకలు

ముఖ్య అతిథిగా నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ - నందిగామ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



(నందిగామ అక్టోబర్ 17 ప్రజా కలం ప్రతినిధి):

నందిగామ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని చదువుల బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీ కొమ్ము కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పాఠశాల ప్రాంగణంలో కొలువుదీర్చారు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ జానపద పాటలకు అనుగుణంగా కోలాటాలు బతుకమ్మ ఆటలతో ప్రాంగణాన్ని కోలాహలంగా మార్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. మహిళల ఐక్యతకు బతుకమ్మ నిదర్శనమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్ గౌడ్, శ్రీలతసురేష్, అగ్గి మమత సురేష్ గౌడ్, నాయకులు ఏఎంసీ డైరెక్టర్ చాకలి నరసింహులు,కె శమోని రామచంద్రి, శివగళ్ళ సుమన్, నరేందర్ రెడ్డి, చాకలి బాలరాజ్, మహిళా గ్రూప్ సభ్యులు శోభ, పద్మ, భాగ్యమ్మ, నెట్కో కంపెనీ ప్రతినిధులు, గ్రామ మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో


ఘనంగా బతుకమ్మ వేడుకలు

నిర్మల్ అక్టోబర్ 17 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలు కన్నులపండుగగా వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, పూలను పూజించే గొప్ప సంస్కృతి మనదని అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను భక్తితో జరుపుకోవాలని అన్నారు. జిల్లా ప్రజలందరికీ దసరా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ అప్పాల కావ్య మాట్లాడుతూ, మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భక్తిశ్రద్ధలతో మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ వండుగను నిర్వహించుకోవాలని తెలిపారు. బతుకమ్మకు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిడబ్ల్యూఓ వినూత్న, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి



నిర్మల్, అక్టోబర్ 17 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా సాయం అందిస్తోందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గారు అన్నారు. కుబీర్ మండలంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పథకాల కింద అర్హులైన 102 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వృథాను అరికట్టేందుకు గ్రామాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచులకు సూచించారు. 24 గంటల పాటు బోర్లు నడిచే గ్రామాల్లో సమయపాలన విధించి నీటిని పొదుపుగా వినియోగించేలా చూడాలన్నారు. వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా పొలాల్లో నీటి కుంటలు, ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో కుబీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోరేకర్ కళ్యాణ్,మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, బీజేపీ కార్యకర్తలు ,లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

నిర్మల్ అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



నిర్మల్,అక్టోబర్ 17(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లా నూతన అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డి. వెంకట మాధవరావును కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ డీసీసీ ఉపాధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సోన్ మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంబేకర్ ప్రసాద్ కుమార్ కలెక్టరేట్‌లో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు.

నూతన ట్రాఫిక్ ఎస్ఐను కలిసిన ఆటో జేఏసీ నాయకులు



ప్రజాకలం ప్రతినిధి, భద్రాచలం, అక్టోబర్ 17 :

భద్రాచలం నూతన ట్రాఫిక్ ఎస్ఐ పడాల కేశవులును ఆటో జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకర్, జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు మర్మం శంకర్ మాట్లాడుతూ, భద్రాచలంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నూతన ట్రాఫిక్ ఎస్ఐ పడాల కేశవులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఆటో కార్మికులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తూ, ఆటో డ్రైవర్లకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి కాకాని సురేష్, థియేటర్ అడ్డా అధ్యక్షుడు పాషా, చర్ల మ్యాజిక్ అడ్డా అధ్యక్షుడు బుచ్చన్న, ఆటో యూనియన్ సభ్యులు నడిపింటి దుర్గ ప్రసాద్, కొత్తపల్లి సాత్విక్, కొత్తపల్లి వెంకట్ పాల్గొన్నారు.

తానూర్ లో బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్



తానూర్,అక్టోబర్ 17(ప్రజా కలం): మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ తాడేవార్ విఠల్ సోదరుడు, బోల్సా గ్రామానికి చెందిన పోతన్న సోదరుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ శనివారం మృతుల ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, శ్యామ్ రావు పటేల్, మండల అధ్యక్షుడు పుండలిక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రకాంత్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారామ టన్నెల్ పనులపై ఖమ్మం ఎంపీ క్షేత్రస్థాయి పరిశీలన

- బురదలో నడుస్తూ పురోగతిని పరిశీలించిన రఘురాం రెడ్డి

ఖమ్మం/సత్తుపల్లి అక్టోబర్ 17 (ప్రజాకలం న్యూస్) సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సత్తుపల్లి మండలం యతాలకుంట గ్రామం వద్ద ప్రాజెక్టు టన్నెల్ ప్రాంతానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో కలిసి వెళ్లారు. బురదలో నడుస్తూ టన్నెల్ ప్రాంతానికి చేరుకున్న ఎంపీ.. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి, పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పనుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతోపాటు, పనులకు సంబంధించిన వివరాలను అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ , జిల్లా అటవీశాఖ అధికారి, కల్లూరు సబ్ కలెక్టర్, సర్పంచులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపులపై ఆకస్మిక తనిఖీలు

ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

గోదావరిఖని : రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి.శ్రీనివాస్ రావు నేతృత్వంలో ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికల్ షాపులపై నార్కోటిక్,డ్రగ్స్ నిరోధక శాఖ మరియు సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి.ఈ తనిఖీల్లో ట్రామడాల్, టాపెంటడాల్, నైట్రాజెపామ్, ప్రెగాబాలిన్, జోల్పిడెమ్, అల్ప్రాజోలం,కోడిన్ కలిగిన దగ్గు సిరప్‌ల విక్రయాలకు సంబంధించిన రికార్డులు,వైద్యుల ప్రిస్క్రిప్షన్లు,సేల్స్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత ఔషధ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా మందుల విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ తప్పనిసరిగా అవసరమైన నియంత్రిత మందులను నిబంధనల ప్రకారమే విక్రయించాలని మెడికల్ షాపుల యజమానులు, సిబ్బందికి సూచించారు. మందుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అనధికారికంగా నియంత్రిత లేదా నిషేధిత మందులను విక్రయించడం, సరఫరా చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో పెద్దపల్లి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పిట్ట శ్రవణ్ కుమార్, నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ దీకొండ రమేష్, సీఐఎస్ఎఫ్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాద్ రెడ్డి (ఆర్ఐ),ఎస్ఐ ఆర్.ఎస్.యాదవ్, హెడ్ కానిస్టేబుల్ బి. మురళీకృష్ణ, నార్కోటిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కాన్స్ వేదికగా తెలంగాణ హవా

డిసెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో ఇండియాజాయ్ 9వ ఎడిషన్!

హైదరాబాద్ : ఫ్రాన్స్‌లోని కేన్స్ నగరం వేదికగా జరుగుతున్న ప్రపంచ ప్రసిద్ధ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్ మార్కెట్ మిప్‌కామ్ కాన్స్ 2026లో తెలంగాణ ప్రభుత్వం తన పెట్టుబడుల ప్రచారాన్ని హోరెత్తించింది.అంతర్జాతీయ వినోద రంగ దిగ్గజాల తో తెలంగాణ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ప్రత్యేకంగా భేటీ అయి, రాష్ట్రంలో స్టూడియో పెట్టుబడులు, సంయుక్త నిర్మాణాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలపై విస్తృత చర్చలు జరిపింది. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్ రెడ్డి నేతృత్వంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఏవిజిసి డైరెక్టర్ వల్లభి ఎ., కన్సల్టెంట్ స్వభావ్ శెట్టిలతో కూడిన బృందం ఇండియా పెవిలియన్‌లో ప్రత్యేక తెలంగాణ స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని చలనచిత్ర పరిశ్రమ, సాంకేతిక సామర్థ్యం, మానవ వనరులు , ప్రతిష్టాత్మక ఇమేజ్ టవర్స్ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ దిగ్గజాలకు వివరించారు.ఈ అంతర్జాతీయ సదస్సులో సోనీ, డ్రీమ్‌వర్క్స్ యానిమేషన్, అమెజాన్ ఎమ్జీఎమ్ స్టూడియోస్‌లతో పాటు కొలంబియాకు చెందిన కార్యాకోల్ టెలివిజన్, బ్రెజిల్ గ్లోబో , స్పెయిన్ ఆర్‌టీవీఈ , లాటిన్ మీడియా కార్ప్, టీజీ ఎంటర్‌టైన్‌మెంట్, అరబ్ మీడియా టీవీ ప్రొడక్షన్ వంటి ప్రపంచవ్యాప్త మీడియా సంస్థలతో తెలంగాణ బృందం సమగ్రంగా చర్చించింది. స్టూడియో నిర్వహణ, యానిమేషన్, వీఎఫ్ఎక్స్ ప్రొడక్షన్, ఒరిజినల్ కంటెంట్ డెవలప్‌మెంట్, ఫార్మాట్ అడాప్టేషన్, డబ్బింగ్-లోకలైజేషన్ రంగాల్లో తెలంగాణలోని సృజనాత్మక సంస్థలకు గ్లోబల్ మార్కెట్ అవకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. దీనికి తోడు దక్షిణ కొరియా , మలేషియా , ఫిలిప్పీన్స్ ఫిల్మ్ అకాడమిలతో దేశాల మధ్య నైపుణ్యాల మార్పిడికి భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. ఈ మిప్‌కామ్ కాన్స్ వేదికపైనే తెలంగాణ విఎఫ్ఎక్స్, యానిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మక ఇండియాజాయ్ 9వ ఎడిషన్ షెడ్యూల్‌ను ప్రతినిధి బృందం అధికారికంగా ప్రకటించింది. టీవాగా ప్రెసిడెంట్, గ్రీన్ గోల్డ్ యానిమేషన్ సీఈఓ రాజీవ్ చిలక, టీవాగా జనరల్ సెక్రటరీ మైక్ యాతంలతో కలిసి ఈ ప్రకటన చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ ఇండియాజాయ్ 2026 ఈవెంట్.. డిసెంబర్ 7 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ లో భాగంగా జరగనుంది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రతిపాదించిన స్టోరీస్, గేమ్స్, డ్రీమ్స్ అనే ఇతివృత్తంతో ఈ వేడుకలు అలరించనున్నాయి. 2018లో ప్రారంభమైన ఇండియాజాయ్.. ఫిల్మ్, యానిమేషన్, విఎఫ్ఎక్స్, గేమింగ్, ఈ-స్పోర్ట్స్, కామిక్స్, ఓటీటీ, ఏఐ సాంకేతికతలకు ఆసియాలోనే అతిపెద్ద కన్వర్జెన్స్ వేదికగా నిలిచింది. ఈ 9వ ఎడిషన్‌లో భాగంగా హైదరాబాద్ కామిక్ కాన్, డ్రీమ్‌హాక్ ఇండియా, విఎఫ్ఎక్స్ సమిట్, దేశీటూన్స్, ఓటీటీ పల్స్, ఇండియన్ ఫిల్మ్ కాంక్లేవ్ , ఇండియాజాయ్ ఏఐ కాంక్లేవ్ వంటి 11 ప్రధాన ఈవెంట్లు జరగనున్నాయి. ఇక్కడ యానిమేషన్-ఫిల్మ్ కంటెంట్ మార్కెట్లు, ఇన్వెస్టర్ కనెక్ట్ ప్రోగ్రామ్‌లు, ప్రొడక్ట్ లాంచ్‌లు మరియు బిజినెస్-టు-బిజినెస్ సమావేశాలు నిర్వహించి, లోకల్ క్రియేటర్లను గ్లోబల్ కొనుగోలుదారులు , ఇన్వెస్టర్లతో అనుసంధానించనున్నారు.మిప్‌కామ్ కాన్స్ ద్వారా తెలంగాణ ఏవిజిసి రంగానికి ఉన్న విదేశీ ఆకాంక్షలను ప్రపంచ మీడియా దిగ్గజాల ముందు నేరుగా ప్రదర్శించగలిగామని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి. అజిత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. ఎకరానికి 10 వేల నష్ట పరిహారం?



హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితుల ను ఎదుర్కొని పంట నష్టపోయిన తెలంగాణ రైతాంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఎండిపోయిన ప్రతీ ఎకరా పంట పొలానికి రూ. 10,000 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం ప్రాథమికంగా భావిస్తోంది. వర్షాభావం వల్ల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంట దిగుబడులు దారుణంగా పడిపోవడమే కాకుండా, ఎకరాలకు ఎకరాలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. ఈ పరిస్థితుల నుంచి వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించేందుకు రేవంత్ ప్రభుత్వం తక్షణ ఉపశమన చర్యలకు శ్రీకారం చుట్టింది.పంట నష్టపరిహారం, కరువు సహాయక చర్యలపై తుది నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం అత్యవసర అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. అన్ని రాజకీయ పక్షాల నేతలు, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ రంగానికి చెందిన నిపుణులతో సీఎం రేవంత్ రెడ్డి, ఇంధన, వ్యవసాయ శాఖ మంత్రులు విస్తృతంగా చర్చించను న్నారు. జిల్లాల వారీగా నమోదైన పంట నష్టం వివరాలు, ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాల జాబితాను ఈ సమావేశంలో సమీక్షించి, ఎకరానికి రూ. 10 వేల నష్టపరిహార ప్రకటనపై అధికారిక ముద్ర వేయనున్నారు.కేవలం రాష్ట్ర ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా, ఎల్‌నినో సృష్టించిన ఈ ప్రకృతి విపత్తును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రత్యేక ఆర్థిక సాయం కోరాలని తెలంగాణ కేబినెట్ యోచిస్తోంది. ఎల్‌నినో తీవ్రత వల్ల తెలంగాణ వ్యాప్తంగా సంభవించిన భూగర్భ జలాల క్షీణత, ఎండిపోయిన చెరువులు మరియు పంట నష్టంపై సమగ్ర నివేదికను తయారు చేసి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నారు. జాతీయ విపత్తు ఉపశమన నిధి కింద తెలంగాణకు వెంటనే ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరాలని అఖిలపక్ష భేటీలో నిర్ణయించనున్నారు. తెలంగాణ మీడియా వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో దాదాపు పలు జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, జొన్న మరియు ఇతర వాణిజ్య పంటలు ఎల్‌నినో కారణంగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకంతో పాటు వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సంయుక్త బృందాలు ద్వారా ఇప్పటికే నష్ట తీవ్రతను గణిస్తున్నారు. సర్వే పూర్తయిన వెంటనే అర్హులైన రైతుల ఖాతాల్లోకి నేరుగా డిబిటి పద్ధతిలో నష్టపరిహార నిధులను జమ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.పంట నష్టపోయిన ఏ ఒక్క రైతు కూడా ధైర్యం కోల్పోవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ వర్గాలు భరోసా ఇస్తున్నాయి. శుక్రవారం జరిగే అఖిలపక్ష సమావేశం అనంతరం నష్టపరిహారం పంపిణీకి సంబంధించిన విధివిధానాలు, కాలపరిమితిని ప్రభుత్వం అధికారి కంగా వెల్లడించనుంది. రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకుంటున్న ఈ వేగవంతమైన నిర్ణయం ఆర్థిక కష్టాల్లో ఉన్న తెలంగాణ రైతాంగానికి పెద్ద ఊరటనిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

నన్ను చంపేందుకు కుట్ర

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి రేఖా ఆర్య తన భర్త గిరిధారి లాల్ సాహుపై సంచలన ఆరోపణలు చేశారు. తనపై గృహ హింసకు పాల్పడుతున్నారని, ప్రాణహాని ఉందని, తనను హత్య చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ డెహ్రాడూన్‌లోని కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భర్తపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు. తన మైనర్ పిల్లల భద్రతపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంత్రి రేఖా ఆర్య ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇటీవల తనకు లభించిన ఒక ఆడియో రికార్డింగ్ తనను తీవ్రంగా కదిలించిందని, తన వైవాహిక జీవితంలోని నిబద్ధతను ప్రశ్నించేలా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.“ఆ ఆడియో విన్న తర్వాతనా పిల్లల భద్రత, రక్షణ కోసం ఈ బాధాకరమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. మహిళలు సామాన్యులైనా, ప్రముఖులైనా గృహ హింసను సహించవద్దు. దానిపై గళం విప్పాలి” అని ఆమె పిలుపునిచ్చారు. తాను వ్యక్తిగతంగా బాధలో ఉన్నప్పటికీ, రాజ్యాంగబద్ధంగా తన విధులను నిర్వర్తిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రేఖా ఆర్య పలు కీలక విషయాలను ప్రస్తావించారు. తనకు 2004లో గిరిధారి లాల్ సాహుతో వివాహం జరిగిందని, అయితే అప్పటికే అతనికి పెళ్లై పిల్లలు ఉన్న విషయాన్ని దాచిపెట్టి తనను మోసం చేశారని ఆరోపించారు.

ఈ విషయం చాలా ఏళ్ల తర్వాత తెలిసిందని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మౌనంగా ఉన్నానని తెలిపారు. ఇటీవల కాలంలో భర్త ప్రవర్తన మారిపోయిందని, ఇతర మహిళలతో సంబంధాలు పెట్టుకున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై నిలదీయడంతో తనపై శారీరకంగా దాడి చేసి, దుర్భాషలాడి, చంపుతానని బెదిరించారని పేర్కొన్నారు. ఓ మహిళతో మాట్లాడుతూ తనను హత్య చేసేందుకు భర్త కుట్ర పన్నుతున్నట్లుగా ఉన్న ఆడియో రికార్డింగ్ తనకు లభించిందని రేఖా ఆర్య ఫిర్యాదులో తెలిపారు. అంతేగాక కంపెనీ డైరెక్టర్ పదవి నుంచి తాను వైదొలిగినట్లు తన సంతకాలను ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లు సృష్టించారని కూడా ఆరోపించారు.

పిట్టలదొర వేషంలో సామాజిక చైతన్యం

- రాష్ట్రవ్యాప్తంగా వినూత్న ప్రచారం
- ఖమ్మంలో డ్రగ్స్ నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్



ఖమ్మం అక్టోబర్ 17 (ప్రజా కలం న్యూస్) ఖమ్మం నగరంలోని శనివారం హాస్యభరితమైన పిట్టలదొర వేషధారణతో సామాజిక చైతన్యం కల్పిస్తూ ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారం చేపడుతున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆయన శనివారం ఖమ్మం న్యూ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల కలిగే అనర్థాలను గుర్తించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. పిట్టలదొర వేషంలో హాస్యంతో ప్రజలను ఆకట్టుకుంటూనే ఆలోచింపజేసే సందేశాలు అందించడం ఆయన ప్రచార ప్రత్యేకత. మరుగున పడుతున్న జానపద కళలను వెలికితీయడంతో పాటు సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే తన లక్ష్యమని ప్రభాకర్ తెలిపారు.

ఎటపాక మండలంలో మూడు ఎంపీటీసీ స్థానాల్లో సీపీఐ పోటీ

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఐని
గెలిపించండి: డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, అక్టోబర్ 17: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎటపాక మండలంలో మూడు ఎంపీటీసీ స్థానాల్లో సీపీఐ అభ్యర్థులను బరిలో నిలుపుతున్నట్లు ఆ పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము తెలిపారు. శనివారం ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో నిర్వహించిన సీపీఐ మండల సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే కమ్యూనిస్టు పార్టీ సీపీఐని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆదరించి గెలిపించాలని వారు కోరారు. ప్రజల పక్షాన నిలబడి హక్కుల సాధన కోసం పోరాడే పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎటపాక మండలంలోని కృష్ణవరం, లక్ష్మీపురం, కన్నాయిగూడెం ఎంపీటీసీ స్థానాల్లో సీపీఐ తరపున పోటీ చేస్తున్నట్లు వారు వెల్లడించారు.
ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, మండల కార్యవర్గ సభ్యులు వరద బ్రహ్మం, పద్దం ఛత్తెమ్మ, సున్నం శ్రీను, సవలం శ్రీరాములు, పూస రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు

అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదు



ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 17: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎటపాక పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు, ప్రజల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉందని ఎటపాక పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించకూడదని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఎటపాక పోలీసులు విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

రంగురంగుల బతుకమ్మలతో కలెక్టరేట్‌లో సందడి..
సంప్రదాయ ఆటపాటలతో హోరెత్తిన వేడుకలు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 17: మహబూబ్‌నగర్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎనిమిదవ రోజు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, మహిళా ఉద్యోగినుల కోలాటాలు, సంప్రదాయ గీతాలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. మహిళా ఉద్యోగినులతో పాటు పురుష ఉద్యోగులు సైతం ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత కళ తీసుకొచ్చారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సంబరాల్లో మునిగిపోయారు. పూల పండుగ ప్రత్యేకతను చాటుతూ పరస్పరం ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామీణాభివృద్ధి శాఖ (డిఆర్‌డిఓ), మెప్మా, జిల్లా పౌర సంబంధాల శాఖ, ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ కార్యాలయాలకు చెందిన మహిళా ఉద్యోగినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో డి . ఆర్.ఓ. నిర్మలా, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, జిల్లా పౌర సంబంధాల అధికారి పి. శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఇశ్రా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం

ఏడవ రోజు పూజల్లో పాల్గొన్న బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 17 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గం గుర్రంగూడలోని శ్రీ దుర్గామాత ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఏడవ రోజు అమ్మవారు సంపద, సౌభాగ్యాలకు ప్రతీక అయిన శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు.అమ్మవారి కృపా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోలేం రాజవర్ధన్ రెడ్డి, పుట్టగల అశోక్, రవీందర్, నరసింహ, పుట్టగల జగన్, పల్లె సాయికిరణ్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సబితమ్మకు పోచంపల్లి పట్టుచీరను బహుకరించిన జల్ పల్లి మహిళా నాయకురాలు కర్నాటి పద్మ

మహేశ్వరం, అక్టోబర్ 17, (ప్రజా కలం)

మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి సాయంత్రం వారి నివాసంలో కంటెస్టేడ్ ఎంపీటీసీ ,కంటెస్టెడ్ కౌన్సిలర్, జల్ పల్లి మహిళా నాయకురాలు కర్నాటి పద్మ వారి కుటుంబ సభ్యులు కాలనీ మహిళలతో మర్యాదపూర్వకంగా కలిసి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల వేళ దసరా పండుగను పురస్కరించుకొని తల్లి సమానురాలైన



సబితమ్మ కి ప్రేమతో ఆప్యాయంగా చిరుకానుకగా పోచంపల్లి పట్టుచీరను బహుకరించడం జరిగింది.ఈ కానుకను సబితా ఇంద్రారెడ్డి చాలా ఆప్యాయంగా ప్రేమతో స్వీకరించడం జరిగింది.ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ మీరు ప్రేమతో ఇచ్చిన కానుక చాలా విలువైనది అని కొనియాడుతూ ప్రజా సంక్షేమమే నా పరమావధి అని తెలిపారు. ప్రజల ఆశయాలే నా ఆలోచన... ప్రజల సంక్షేమమే నా ఆశయం,..మహేశ్వరం అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ముందుకు సాగుతాను. ప్రజల ఆకాంక్షలే నా సంకల్పం అని అన్నారు. ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రజల గొంతుకగా వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను అన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మహేశ్వరం నియోజకవర్గం ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేస్తాను అని అన్నారు.

పంచాయతీ సిబ్బందికి నూతన దుస్తుల పంపిణీ

బీబీనగర్, అక్టోబరు 17 (ప్రజాకలం): మండలంలోని రాఘవాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో దసరా పండుగను పురస్కరించుకుని శుక్రవారం గ్రామ



పంచాయతీ సిబ్బందికి సర్పంచి సిద్ధగోని శ్రీకాంత్‌గౌడ్ నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది పాత్ర కీలకమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో వారి కృషి ప్రశంసనీయమని అన్నారు. పండుగను పురస్కరించుకుని సిబ్బందికి దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తోరుపునూరి రవి, న్యాలపట్ల అజయ్, గుంటిమిది విజయలక్ష్మి, గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

నేదునూరులో రైతుల పోరాటం ఫలితం

- అదనంగా 100 హెచ్పి ట్రాన్స్ఫార్మర్ మంజూరు
- కందుకూరు మండలంలో ఎండిపోతున్న పంటలను పరిశీలించిన
- రైతు సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బాక రామచందర్



కందుకూరు, అక్టోబర్ 17 (ప్రజా కలం):

కందుకూరు మండలం నేదునూరు గ్రామంలోని అక్బర్జా రెవెన్యూ సర్వేనెంబర్ 9లోని 74 ఎకరాల ప్రభుత్వ భూమిలో తాతల కాలం నుంచి రైతులు పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. అక్కడ 100 హెచ్ పి ట్రాన్స్ఫార్మర్ ఒక్కటే ఉండటం వల్ల వచ్చే ఆరాకొర కరెంటుతో ఫ్యూజులు ఎగిరిపోవడం, మోటార్లు నడవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బాక రామచందర్ అన్నారు.ఈ నేపథ్యంలో రైతు సంఘం, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేసి ఎస్ ఈ , డి ఈ గార్లతో మాట్లాడి అదనంగా మరో 100 హెచ్ పి ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేయించారు. అదనంగా ఐదు స్తంభాలు, వైర్లు గుంజుపించడం జరిగింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం నేదునూరులో ఎండిపోయిన పంటలను రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతు సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బాక రామచందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవక చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయని, భూగర్భ జలాలు అడుగంటాయని అన్నారు. వచ్చిపోయే కరెంటుతో పంటలు పారలేక వందల ఎకరాల్లో వంటలు ఎండిపోయాయని, రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని, వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న కరువు పరిస్థితుల దృష్ట్యా రంగారెడ్డి జిల్లాను కరువు జిల్లాగా, అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన మండలంగా కందుకూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరారు. కరువును ఆసరా చేసుకుని మిల్లర్లు బియ్యం ధరలు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు.

తక్షణ చర్యగా ప్రజలకు పశుగ్రాసం, తాగునీరు అందించాలని, పంటలు ఎండిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం ఇవ్వాలని, రానున్న పంటలకు ప్రభుత్వమే పెట్టుబడులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బి. శ్రీనివాస్, ఏ. కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వంగూరి యాదయ్య, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మిద్దె యాదయ్య, గ్రామ కార్యదర్శి ఎస్. రాములు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత మండపంలో గోలి ప్రణీత పింగల్‌రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు

మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారికి పూజలు.. అన్నప్రసాద వితరణ

బీబీనగర్, అక్టోబరు 17 (ప్రజాకలం): బీబీనగర్ పట్టణంలోని శ్రీ తుల్జా భవాని ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీబీనగర్ మండల మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ గోలి



ప్రణీత పింగల్‌రెడ్డి దంపతులు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసుల అంజనేయులుగౌడ్, ప్రధాన కార్యదర్శి పెరబోయిన బస్వరాజ్ యాదవ్, బీబీనగర్ వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లింగబసవేశ్వరస్వామి ఆలయంలో నిత్య అన్నదాన సేవ

- ప్రతి శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ

భక్తులకు అన్నప్రసాద వితరణ చేసిన మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య

బీబీనగర్, అక్టోబర్ 17 (ప్రజాకలం): మండలంలోని పడమటి సోమారం గ్రామంలో కొలువుదీరిన శ్రీ లింగబస వేశ్వరస్వామి ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం



నిర్వహిస్తున్నా రు. ఇందులో భాగంగా శనివారం మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.స్వామివారిని దర్శించుకున్న భక్తులకు అన్నప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆల్వా రామకృష్ణారెడ్డి, ధర్మకర్త గండు రాజు యాదవ్, ఆలయ మాజీ చైర్మన్ ఆల్వా వీరారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆలేటి బలరాం రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చందర్లపాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

కూటమి జెండా ఎగరేద్దాం! - అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

చందర్లపాడు: మండలంలోని ప్రతి గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. చందర్లపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆమె నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు.56 బూత్‌లలో 5,027 ఓట్ల ఆధిక్యం.. కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనంగత అసెంబ్లీ ఎన్నికల్లో చందర్లపాడు మండలంలోని 56 బూత్‌లలో 5,027 ఓట్ల ఆధిక్యాన్ని అందించడం ఒక్కరి విజయమో కాదని, ప్రతి గ్రామంలో ప్రతి గడపను పలకరిస్తూ, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితమని తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.

గత రెండేళ్లలో తల్లికి వందనం, పెంచిన పింఛన్లు, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తల పాత్ర అభినందనీయమన్నారు. గ్రామాల్లో రోడ్లు, వ్యవసాయ విద్యుత్, వైద్య సదుపాయాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రజా సమస్యల పరిష్కారంలోనూ కార్యకర్తలు తనకు అండగా నిలుస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు.కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం మళ్లీ ప్రగతి బాటలోముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిబద్ధత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. తల్లికి వందనం, రూ.4,000 పింఛను, అన్నదాత సుఖీభవ, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు భోజన సదుపాయం వంటి కార్యక్రమాలు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చేపట్టిన చర్యలని వివరించారు.వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు రూ. 15 కోట్లునందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని 37 గ్రామాలకు, 17 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించే లక్ష్యంతో ఉన్న వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకం గత ఐదేళ్లలో నిర్వహణ లోపంతో నిర్లక్ష్యానికి గురైందని సౌమ్య గారు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పథకం పునరుద్ధరణ కోసం ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేయగా, రూ. 15 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జలవనరుల శాఖ మంత్రి శ్రీ నిమ్మల రామానాయుడు పునరుద్ధరణ పనులను ప్రారంభించారని, 2027 ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని వెల్లడించారు.

మరో కేంద్ర మంత్రి రాజీనామా? కొత్త టీం ఎప్పుడు?



న్యూఢిల్లీ : కేంద్ర సమాచార ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ హఠాత్తుగా తన పదవితో పాటు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం కలకలం రేపింది. తమిళనాడులో బిజెపి మూలాలను పటిష్టం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేసేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. సాధారణ రోజు కూలీల కుటుంబం నుంచి వచ్చిన తనకు ప్రధాని మోదీ మంత్రివర్గంలో భాగస్వామ్యం కల్పించడం గొప్ప గౌరవమని, ఇకపై పార్టీ ఆర్గనైజేషన్‌కు తన సమయాన్ని కేటాయిస్తానని ఎక్స్ వదికగా వేసిన పోస్ట్‌లో మురుగన్ స్పష్టం చేశారు.మురుగన్ వైదొలగడం కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో మోదీ 3.0 సర్కార్‌లో జరగబోయే భారీ మంత్రివర్గ విస్తరణకు ఇది ప్రధాన సంకేతమని భావిస్తున్నారు. గత కొన్ని రోజులుగా కేంద్ర మంత్రివర్గంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాజ్యసభ పదవీకాలం ముగియడంతో కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టూ, జార్జ్ కురియన్ తమ పదవులకు రాజీనామా చేయగా, హర్దీప్ సింగ్ పురీ, బి.ఎల్. వర్మ వంటి సీనియర్లను పార్టీ రాజ్యసభకు పునరుద్ధరించలేదు. మరోవైపు సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను దిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియమించడంతో ఒక వ్యక్తికి ఒకే పదవి నిబంధన ప్రకారం ఆయన కూడా మంత్రిపదవి నుంచి తప్పుకోనున్నారు.ఇలా దాదాపు అరడజనుకు పైగా కేంద్ర మంత్రి పదవులు ఖాళీ కావడంతో, ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో భారీ రీ-షఫుల్‌కు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జరగబోయే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, అలాగే 2029 సార్వత్రిక ఎన్నికల వ్యూహాలకు అనుగుణంగా కేంద్ర క్యాబినెట్‌లో ప్రాంతీయ, సామాజిక సమతుల్యతను దెబ్బతినకుండా చూసేందుకు బిజెపి అగ్రనాయకత్వం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపేలా స్థానిక నాయకులను సంస్థాగత బాధ్యతల్లోకి మళ్లిస్తూ, లోక్‌సభ సభ్యులుగా ఉన్న కొందరు సీనియర్లకు కేంద్రంలో అవకాశం కల్పించవచ్చని ప్రచారం సాగుతోంది.మురుగన్ లాంటి సీనియర్ నేతలను తిరిగి క్షేత్రస్థాయికి పంపి, కేంద్రంలో ఖాళీ అయిన స్థానాలను కొత్త ముఖాలతో భర్తీ చేసేందుకు వీలుగా దిల్లీ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, పార్టీ యంత్రాంగాన్ని రాబోయే ఎన్నికల కోసం సన్నద్ధం చేయడమే లక్ష్యంగా మోదీ-అమిత్ షాల ద్వయం ఈ మంత్రివర్గ విస్తరణ వేదికగా కొత్త వ్యూహాలను అమలు చేయబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కేంద్ర ఖజానాకు భారీ ఆదాయం

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నట్లు సూచిస్తూ ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో భారీ వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో అక్టోబర్ 14 నాటికి నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.13.38 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 13.21 శాతం అధికమని ఆదాయ పన్ను శాఖ నేడు విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కార్పొరేట్ పన్ను, నాన్-కార్పొరేట్ పన్ను (వ్యక్తిగత ఆదాయ పన్ను), 'సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్' (ఎస్‌టీటీ) వసూళ్లు పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది.రిఫండ్‌లను సర్దుబాటు చేయకముందు, స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.89 శాతం పెరిగి రూ.16.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ వసూళ్లు రూ.13.95 లక్షల కోట్లుగా ఉన్నాయి.



అమ్మవారి సన్నిధిలో ఆదర్శ్ రెడ్డి

- నవరాత్రి వేడుకల్లో ఆదర్శ్ రెడ్డి.. ప్రత్యేక పూజలు..

పటాన్‌చెరు, అక్టోబర్ 17 (ప్రజా కలం) ప్రతినిధి

దేవి నవరాత్రి ఉత్సవాల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.బీరంగూడ డివిజన్ మాజీ కౌన్సిలర్ ప్రమోద్ రెడ్డి ఆహ్వానం మేరకు బీరంగూడలో జరిగిన ఉత్సవాలకు హాజరయ్యారు.అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలోని సిరికి కార్యాలయం,ఎఫ్ పార్క్,నేతాజీ ఫంక్షన్ హాల్, ఓల్డ్ ఎంఐజీ బి పార్క్‌లలో నిర్వహించిన నవరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. ఓల్డ్ ఎంఐజీ బి పార్క్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ,దేవి నవరాత్రులు అమ్మవారి శక్తి, వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు మహాలక్ష్మి అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తాయని తెలిపారు. ఉత్సవాల నిర్వాహకులకు, భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు..

పటాన్‌చేరులో స్వామివారి కల్యాణ మహోత్సవం

-జగత్ కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా పాల్గొన్న కంజర్ల కృష్ణమూర్తి..

పటాన్‌చేరు, అక్టోబర్ 17 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చేరులోని మాత గోవిందమ్మ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రసన్న దేవాలయంలో నిర్వహించిన ఆరో వార్షిక జగత్ కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో భాజపా సంగారెడ్డి జిల్లా క్రీడా విభాగం కన్వీనర్, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య



సంఘం పటాన్‌చేరు నియోజకవర్గ అధ్యక్షుడు కంజర్ల కృష్ణమూర్తి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీధర్ చారి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి హాజరైన కంజర్ల కృష్ణమూర్తి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మాత గోవిందమ్మ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ చారి, సాయి వెంకట హర్ష చారి తదితరులు పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు..

సంతోషిమాత ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 17 (ప్రజా కలం ప్రతినిధి):


గజ్వేల్ పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు,కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం యాదవ రెడ్డి మాట్లాడుతూ, శరన్నవరాత్రి వేళ సంతోషిమాతను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.గజ్వేల్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని,అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పురోహితులు దేశపతి రాజశేఖర శర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్ గోలి మమత సంతోష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఎన్నికలపై కాంగ్రెస్ గురి

-ఓటరు నమోదుపై మహేష్ గౌడ్ దిశానిర్దేశం

-నీలం మధుకు కీలక సూచనలు..



పటాన్‌చెరు, అక్టోబర్ 17 (ప్రజా కలం) ప్రతినిధి

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే కార్యాచరణపై దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసేలా నాయకత్వం దిశానిర్దేశం చేస్తోంది. ఈ నేపథ్యంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ శనివారం నార్సింగిలోని నివాసంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియతో పాటు పలు కీలక అంశాలపై మహేష్ కుమార్ గౌడ్ సూచనలు చేశారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని, ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమష్టిగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు..

అమీన్‌పూర్‌లో అమ్మవారి జాతర..

- 22న మహా శోభాయాత్ర..

17 ఏళ్లుగా వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..



అమీన్‌పూర్, అక్టోబర్ 17 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్‌పూర్ పెద్ద చెరువు వద్ద ఈ నెల 22వ తేదీ గురువారం సాయంత్రం నిర్వహించనున్న దుర్గా భవాని అమ్మవారి మహా శోభాయాత్రకు రాజకీయ ప్రముఖులు హాజరుకానుండటంతో ఉత్సవాలపై ఆసక్తి నెలకొంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. గత 17 సంవత్సరాలుగా పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో అమీన్‌పూర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జరగనున్న మహా శోభాయాత్రకు హరీశ్ రావును ఆహ్వానించగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తప్పకుండా ఉత్సవాలకు హాజరవుతానని హామీ ఇచ్చి, శోభాయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం జరిగే మహా శోభాయాత్రలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కళాకారుల ప్రదర్శనలు, భజనలు, కోలాటాలు, ఆటపాటలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని పాండురంగారెడ్డి తెలిపారు. భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్ కృష్ణ, బిజిలి రాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల ఉపేందర్ రెడ్డి, కొల్లూరి గోపాల్, పలువురు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో

విజయదశమి వేడుకలు

గజ్వేల్ పుర వీధుల్లో ఘనంగా శోభాయాత్ర



గజ్వేల్:17 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.సంఘ్ స్థాపనా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం, స్వయంసేవకుల క్రమశిక్షణ,దేశభక్తి ప్రదర్శనకు వేదికగా నిలిచింది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గజ్వేల్ పురవీధుల్లో నిర్వహించిన ఘన శోభాయాత్ర (పథ సంచలన్) ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.పూర్ణ గణవేషం ధరించిన వందలాది మంది స్వయంసేవకులు సంఘ్ ఘోష్ (బ్యాండ్) వాయిద్యాల లయబద్ధమైన శబ్దాల నడుమ కదం తొక్కారు.పట్టణంలోని ముఖ్య కూడళ్ల గుండా సాగిన ఈ శోభాయాత్రకు స్థానిక ప్రజలు, మహిళలు హారతులు వడుతూ,పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.భారత్ మాతా కీ జై, వందేమాతరం నినాదాలతో గజ్వేల్ పురవీధులు మారుమోగాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్య వక్తలు మాట్లాడుతూ, సమాజంలో ఐక్యతను పెంపొందించడం, ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తోందని పేర్కొన్నారు. విజయదశమి రోజునే సంఘ్ ప్రారంభమైందని,నాటి నుండి నేటి వరకు దేశ రక్షణలో,సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వయంసేవకులు ఎల్లప్పుడూ ముందుంటున్నారని కొనియాడారు.హిందూ సమాజం ఐక్యంగా ఉంటూ,నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా స్వయంసేవకులు చేసిన శారీరక ప్రదర్శనలు,లాఠీ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ ఉత్సవంలో సంఘ్ ప్రముఖులు, వివిధ విభాగాల బాధ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



రజక సంఘం రాష్ట్ర నాయకులు పర్షరాములుకు పరామర్శ.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 17.

రజక సంఘం రాష్ట్ర నాయకులు గౌరీగారి పర్షరాములు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం రాయపోల్ మండల కేంద్రంలో సామాజిక కార్యకర్తలు, దళిత బహుజన సంఘాల నాయకులు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరి యాదవ్, ఉపాధ్యాయులు ఉషనగల్ల కిష్టయ్య, తిరుమలాపూర్ మాజీ ఎంపీటీసీ బండారు దేవేందర్, రాయపోల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు, తుడుం నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజీ ప్రభుకు వంటేరు ప్రతాప్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

వర్గల్ సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

గజ్వేల్, అక్టోబర్ 17 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజీ ప్రభు జన్మదినం సందర్భంగా వర్గల్ శ్రీ



విద్యా సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ సమక్షంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం,గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి రాజీ ప్రభును శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఈదోళ్ల కృష్ణ, సైదముల్లా లింగం, సోమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్తు ఇబ్బందులు లేకుండా చూడాలి

భట్టుగూడెంలో రైతులతో విద్యుత్తు శాఖ రాష్ట్ర ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాసులు సమావేశం

బీబీనగర్, అక్టోబర్ 17, (ప్రజాకలం): రైతులకు వ్యవసాయ అవసరాల కోసం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ రాష్ట్ర ఆపరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం భట్టుగూడెం గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశం



నిర్వహించి, వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రైతులతో నేరుగా మాట్లాడి, విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, అంతరాయాల గురించి ఆరా తీశారు. పంటలకు సకాలంలో నీరందించేందుకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు ఏవైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను తెలుసుకుని, మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కందాడి సురేష్ కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ మచ్చేందర్, ఏఈ మనోహర్ రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్లు యాదగిరి, రియాఉద్దిన్, స్థానిక లైన్‌మెన్ నరేందర్, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.





తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

-కళాశాల చైర్మన్ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

- సెక్రెటరీ హరినాథ్ రెడ్డి ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 17 (ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ లోని తీగల కృష్ణారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.దాదాపు 5 వేలకు పైగా విద్యార్థులతో పెద్ద ఎత్తున బతుకమ్మ మరియు దాండియా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి, సెక్రెటరీ హరినాథ్ రెడ్డి, ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి , ప్రిన్సిపాల్స్, హెచ్ ఓ డి లు హాజరై సంబరాలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని, ప్రతి ఇంట్లో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఆడపడుచులకు ఎంతో సంతోషాన్నిస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.





మహేశ్వరంలో మణప్పురం ఫైనాన్స్ నూతన శాఖ ప్రారంభం

ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, అక్టోబరు 17 (ప్రజా కలం): మహేశ్వరం పట్టణంలో ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మణప్పురం ఫైనాన్స్ నూతన శాఖ ప్రారంభమైంది. పులిమామిడి రోడ్డులోని పోల్కం బాలయ్య నివాస సముదాయంలో ఏర్పాటు చేసిన శాఖను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి. సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి శాఖను ప్రారంభించిన ఆమె అనంతరం మాట్లాడారు.

మహేశ్వరం పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రముఖ ఆర్థిక సంస్థ ఇక్కడ శాఖ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మణప్పురం ఫైనాన్స్ వంటి సంస్థలు బంగారు రుణాలను అందించడం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ సంస్థ మంచి పేరు సంపాదించాలని నిర్వాహకులకు సూచించారు. సంస్థ మరింత అభివృద్ధి చెంది, భవిష్యత్తులో మరిన్ని శాఖలు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, ఉపసర్పంచ్ జోరల్ల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మహేశ్వరం మండల బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం సంస్థ నిర్వాహకులు సబితా ఇంద్రారెడ్డిని శాలువాతో సత్కరించారు.



దుర్గామాత మండపాలను సందర్శించిన పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 17 (ప్రజా కలం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి జీహెచ్ఎంసీ పరిధిలోని పలు దుర్గామాత మండపాలను శుక్రవారం సందర్శించారు. బాలాపూర్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నిరుడు శ్రీరాములు, రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బోయపల్లి వెంకట్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, బొల్లపల్లి కుమార్, బేకుల శశిధర్‌రెడ్డి, ఎదుల్ల ప్రతాప్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, అమృత నాయుడు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శివగంగ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 17,(ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ శివగంగ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి చేరుకున్న సబితా ఇంద్రారెడ్డి కి వేద పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆలయ సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆమెకు శాలువా కప్పి సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రైతుల బాధ ఆవేదన ప్రభుత్వానికి పట్టదా

అమీర్‌పేటలో విద్యుత్ సరఫరా అంతరాయం రైతుల ఆవేదన ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన

మహేశ్వరం, అక్టోబర్ 17,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేట గ్రామంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్యవసాయ మోటార్లకు సకాలంలో కరెంటు రాకపోవడంతో పొలాలకు నీరు పెట్టలేకపోతున్నామని, ప్రస్తుతం పంటలు పూత, కాత దశలో ఉన్నాయని, ఈ సమయంలో నీరు అందకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

రోజులో కొన్ని గంటలు మాత్రమే విద్యుత్ వస్తుండటం, వచ్చినా లో వోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో అమీర్‌పేట గ్రామ రైతులు తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన సబితా ఇంద్రారెడ్డి , సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. రైతులు పండించిన పంటకు సరైన సమయంలో నీరు అందకపోతే వారి శ్రమ వృధా అవుతుందని, రైతు సమస్యల పట్ల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్తానని, రైతులకు అండగా ఉంటానని ఆమె భరోసా ఇచ్చినట్లు రైతులు తెలిపారు.



ఈ కార్యక్రమంలో అమీర్పేట మాజీ ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్ పటేల్, మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, పిఎసిఎస్ బైట్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

450 మంది శ్రామికులకు దసరా కానుకలు..

- కార్మికుల మోములో పండుగ వెలుగులు..

- నూతన వస్త్రాలతో నందారం నరసింహ గౌడ్ ఆత్మీయత

పటాన్‌చెరు, అక్టోబర్ 17 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్‌పూర్ పరిధిలో ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా కోసం నిరంతరం శ్రమించే 450 మంది కార్మికులకు మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు నందారం నరసింహ గౌడ్ దసరా కానుకగా నూతన వస్త్రాలు పంపిణీ చేసి ఆత్మీయతను చాటుకున్నారు. తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి మహిళా కార్మికులకు చీరలు, పురుష కార్మికులకు చొక్కాలు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ, ఎండనక, వాననక ప్రజలకు సేవలందించే కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని కొనియాడారు. కార్మికులు తమ కుటుంబాలతో సంతోషంగా దసరా జరుపుకోవాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్మికులు తమ సేవలను గుర్తించి గౌరవించిన నందారం నరసింహ గౌడ్ కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్జీ యువసేన సభ్యులు ఇంద్రేశం ప్రకాష్ ముదిరాజ్, ఇంద్రేశం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నందారం శ్రీనివాస్ గౌడ్, దాసు యాదవ్, శేఖర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, మల్లేష్, భాస్కర్ రెడ్డి, కార్మిక సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు..



సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా రోడ్డు భద్రతా అవగాహన

అవయవదాన ప్రతిజ్ఞ

ముఖ్య అతిథిగా రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు గందమళ్ల ఆనంద్ గౌడ్

జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోతర్ల సుదర్శన్ యాదవ్



రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 17 (ప్రజా కలం):

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోతర్ల సుదర్శన్ యాదవ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా అవగాహన, అవయవదాన ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు గందమళ్ల ఆనంద్ గౌడ్ హాజరయ్యారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్లు మాట్లాడవద్దని, మీ భద్రతే మీ కుటుంబ భవిష్యత్తు అని వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు.అదేవిధంగా అవయవదానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, అవయవదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చనే సందేశాన్ని అందించారు. ప్రజల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, మానవతా విలువలు పెంపొందించడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాతీయ కిసాన్ మోర్చా నాయకులు పాపయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుండే వెంకటేష్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నర్సింహా, జిల్లా కార్యదర్శి ఆకుల్ల యాదయ్య గౌడ్, మండల అధ్యక్షులు తెల్గాముల్ల యాదిష్, ప్రధాన కార్యదర్శులు వానంపల్లి శ్రవణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి.

దుబ్బాక ప్రజాకలం అక్టోబర్ 17.

రైతులు పంటలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ చీడపీడలు, బెట్ట పరిస్థితులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి సూచించారు. శనివారం రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లిలో గజ్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్‌తో కలిసి వరి, పత్తి, కంది పంటలను పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు, పత్తి, కంది పంటల్లో బెట్ట పరిస్థితులను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. పంట పరిస్థితిని బట్టి సిఫార్సు చేసిన ఎరువులు, పురుగుమందులను నిర్ణీత మోతాదులోనే వినియోగించాలని, మందులను కలిపి పిచికారీ చేసే ముందు వాటి అనుకూలతను నిర్ధారించుకోవాలని తెలిపారు. సందేహాలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్. నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారి స్వర్ణలత, రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికల్లో సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలి

కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి

- నవంబర్ 6 వరకు పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలి: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



మల్కాజిగిరి,అక్టోబరు 17
(ప్రజా కలం ప్రతినిధి):

హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు ప్రతి నాయకుడు,కార్యకర్త సమన్వయంతో కష్టపడి పనిచేయాలని పట్టభద్రుల ఎన్నికల మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను పట్టభద్రులకు వివరించి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లోని వైనంవల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మైనంపల్లి రోహిత్‌తో పాటు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని,అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని అన్నారు. పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి, నవంబర్ 6వ తేదీ వరకు అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని, పట్టభద్రులను కలిసి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు క్షేత్రస్థాయిలో సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, రాజ్ జితేంద్రనాథ్, ఏకే మురుగేష్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, జీఎన్‌వీ సతీష్ కుమార్, ఉపేందర్ రెడ్డి, పిట్టల శ్రీనివాస్, సంతోష్ రాందాస్, డివిజన్ అధ్యక్షులు జీడీ సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, పిట్టల నాగరాజు, మంద భాస్కర్, రొట్టెల ధరణ్ కుమార్, యూసుఫ్, రాఘవన్, లక్ష్మి, కపిలేశ్వర్, రామచందర్, జీడీ చరణ్‌జిత్ గౌడ్, ఆశా, సుమలత, ఇందిరా ప్రియదర్శిని, శారద, పుష్పలత, కనకలక్ష్మి, జీవన్ రెడ్డి, చెన్నారెడ్డి, బాలరాజు యాదవ్, మోహన్ రాజ్, పార్థసారథి, నరేష్, బుజ్జన్న, సుంకు శ్రీనివాస్, బాబు, సత్యనారాయణ, శ్రీరాములు యాదవ్, ఇస్తారి, కుట్టి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రంగంపేటలో ఘనంగా దీపారాధన

భక్తిశ్రద్ధలతో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు

మెదక్ అక్టోబర్ 17 (ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దీపారాధన కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి సన్నిధిలో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు భక్తిప్రపత్తులతో దీపాలు సమర్పించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామ ప్రజలందరిని ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ ప్రాంగణం దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల అమ్మవారి నామస్మరణతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- పండుగ అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం

-జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్యెం రాఘవరెడ్డి

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 (ప్రజా కలం)

రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని జూలూరు పీఏసీఎస్ చైర్మన్ కళ్యెం రాఘవరెడ్డి విజ్ఞప్తి చేశారు. పిల్లాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పండుగ అనంతరం పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రస్తుతం కొందరు వ్యాపారులు క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,200కే కొనుగోలు చేస్తున్నారని, రైతులు తొందరపడి తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి నాణ్యతగా సిద్ధం చేసుకుని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరించినా, అవసరమైతే గోదాములకు తరలించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తుఫాను వచ్చే అవకాశం ఉంటే రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు త్వరగా నిర్వహించి ధాన్యాన్ని సకాలంలో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కళ్యెం రాఘవరెడ్డి తెలిపారు.



పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో

ఘనంగా బతుకమ్మ సంబరాలు

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 17 ప్రజా కలం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో బతుకమ్మ సంబరాలను బ్యాంకు చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళా సిబ్బంది సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఆనందంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యత మరియు ఆత్మీయతను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, బ్యాంకు సీనియర్ మేనేజర్ మధుసూదన్, డైరెక్టర్లు, బ్యాంకు మహిళా సిబ్బంది,ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com